ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు


5

బుధవారం 11 జూన్ 2025



జుమ్మామసీదు వీధిలో నిర్మాణంలో ఉన్న భవనం

లంచంకొద్దీ అంతస్తులు



కడప కార్పొరేషన్‌లోని సిటీ ప్లానింగ్ విభాగంలో అవినీతి అంతస్తుల్లా పెరిగిపోతోంది. దీనికి కారణం ఇక్కడ పనిచేస్తున్న ఓ అధికారి. ఆయన పనిచేసిన ప్రతిచోటా అవినీతి అధికారిగా ముద్రపడ్డారు. ఈయన మాకు వద్దు మొర్రో అంటూ ప్రజాప్రతి నిధులే సర్వసభ్య సమావేశంలో మొత్తుకున్నారు. ఈ నేపథ్యంలో బదిలీపై కడపకు వచ్చారు. అలవాటు పడ్డ ప్రాణం అన్నట్లుగా.. ఆయన పనిచేసే చోటు మారిందే కానీ ఆయన అవినీతి బుద్ధి ఏమాత్రం మారలేదంటారు. దీంతో ఇప్పుడు కడపలో అడ్డగోలుగా నిబంధనలు పాటించకుండా భవనాల నిర్మాణాలు సాగుతున్నాయి. నిర్మాణదారులతో నేరుగా ఆ సారే డీల్ కుదుర్చు కుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కాకమునుపే 387 నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా సాగినట్లు ఇటీవల మంత్రి నారాయణ వెల్లడించారంటే ఇక్కడ అక్రమ నిర్మాణాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. కనీసం అగ్నిమాపక శాఖ వాహనాలు కానీ, అంబులెన్స్‌లు కానీ వెళ్లేందుకు కూడా వీలు లేకుండా నిర్మాణాలు సాగిస్తున్నారు.

- వాణిజ్య భవన నిర్మాణాల్లో బరితెగింపు
- కాసులు తీసుకుని కళ్లు మూసుకున్న సిటీ ప్లానింగ్
- కమర్షియల్ భవనానికి రూ.15లక్షల నుంచి రూ.20లక్షలు?
- ఇతర నిర్మాణాలకైతే రూ.5లక్షల నుంచి రూ.15లక్షలు
- సెట్‌బ్యాక్ లేకుండానే నిర్మాణాలు
- అగ్ని ప్రమాదాలు జరిగితే అంతే సంగతులు

(కడప-ఆంధ్రజ్యోతి): కడప నగరం బాగా విస్తరిస్తోంది. కార్పొరేట్ సంస్థలు ఇక్కడ తమ బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తున్నాయి. దీంతో కడపలో కమర్షియల్ భవనాలకు డిమాండ్ పెరిగింది. నిబంధనల ప్రకారం వాణిజ్య భవనాలు నిర్మిస్తే.. ముందు వైపు రోడ్డు వైండింగ్‌కు స్థలాన్ని వదలడంతో పాటు మూడు మీటర్ల సెట్‌బ్యాక్, కుడి, ఎడమ వెనుక వైపు ఒకటిన్నర మీటరు సెట్‌బ్యాక్ వదలాలి. ఏదైనా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సెట్‌బ్యాక్ కారణంగా ప్రమాద తీవ్రత తగ్గుతుంది. ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఆస్కారం ఉంటుంది. అయితే ఈ నిబంధనలన్నింటికీ సిటీప్లానింగ్ అధికారులు పాతరేశారు. భవన నిర్మాణదారులతో కుమ్మక్కయ్యారు. కమర్షియల్ భవనానికి అయితే రూ.20 లక్షల నుంచి రూ.25లక్షలు, జీప్లస్ 1 నిర్మాణానికి అయితే రూ.10లక్షల నుంచి 15లక్షల మధ్య తీసుకుని అనుమతి ఇచ్చేస్తున్నారనే విమర్శలున్నాయి.

మచ్చుకి కొన్ని..

సెవెన్‌రోడ్స్ చుట్టుపక్కలా వీధులన్నీ కమర్షియల్ ఏరియాలో ఉన్నాయి. ఇక్కడ ఏవైనా దుకాణాలు ఏర్పాటు చేస్తే జనం పెద్దఎత్తున వస్తుంటారు. ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే కనీసం ఫైర్‌ఇంజన్లు తిరగడానికి కాదు కదా.. అగ్నిప్రమాదం వల్ల వచ్చే పొగ బయటికి వెళ్లేందుకు కూడా అవకాశం ఉండదు. కడప కార్పొరేషన్ అధికారులు కాసులకు కక్కుర్తి పడి ప్రజల ప్రాణాలనే పణంగా పెడుతున్నారన్న విమర్శ ఉంది.



సెవెన్‌రోడ్స్ నుంచి గోకుల్‌లాడ్జి వెళ్లే మార్గంలో నిర్మాణంలో ఉన్న వాణిజ్య భవనం

- కడప సెవెన్‌రోడ్స్ నుంచి పొట్టిశ్రీరాములు విగ్రహం వద్దకు వెళ్లే ఎస్‌ఎఫ్‌ఎస్ స్ట్రీట్ మంచి బిజినెస్ ఏరియా. మెడికల్ స్టోర్లు, ఫర్నీచర్, ఎలక్ట్రానిక్స్, శానిటరీ, ఫుట్‌వేర్ ఇతర వాణిజ్య సంస్థలున్నాయి. సెవెన్‌రోడ్స్ నుంచి పొట్టిశ్రీరాములు విగ్రహం వెళ్లే దారిలో కుడి వైపున ప్రస్తుతం నాలుగంతస్తుల భవన నిర్మాణం జరుగుతోంది. దీనికి వెనుక వైపు మునిరావువీధి ఉంది. అంటే ఈ భవనం రెండు రోడ్ల మధ్య నిర్మిస్తున్నారు. అయితే ఇక్కడ సెట్‌బ్యాక్ వదలకుండా వాణిజ్య భవనం నిర్మించడం గమనార్హం.
- మునిరావుస్ట్రీట్‌కు పాలెంపాపయ్యవీధికి మధ్యలో క్రిష్ణాసర్కిల్ వెళ్లే రోడ్డు సమీపంలో ఓ వాణిజ్య భవనం నిర్మాణం సాగుతోంది. ఇక్కడా నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్ లేదు.
- వైవీ స్ట్రీట్ సమీపంలో జుమ్మామసీదుకు వెళ్లడానికి 8అడుగుల రోడ్డు ఉంటుంది. ఆ ఇరుకు రోడ్లలో సైతం పై అంతస్తులు కడుతున్నారు.

పదేళ్లుగా నిలిచిన నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్

వైవీ స్ట్రీట్ అంటేనే బిజినెస్ అడ్డా. ఇక్కడ దొరకని వస్తువంటూ లేదు. అందుకే ఇక్కడ స్థలం విలువ కూడా బాగా ఎక్కువే. ఇక్కడ ప్రధాన రోడ్లు మినహాయిస్తే మిగతా సందులు గొందులు అన్నీ 10 నుంచి 12 అడుగులు మాత్రమే ఉంటాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ వాణిజ్య భవనాలు నిర్మిస్తుండడంతో గతంలో పనిచేసిన సిటీ ప్లానింగ్ అధికారులు వాటిని నిలిపివేశారు. వాస్తవంగా అక్కడ జీప్లస్1కు మాత్రమే అనుమతులు వస్తాయి. అంతకుమించి కడుతున్న అంతస్తులను అప్పట్లో అధికారులు అడ్డుకున్నారు. దీంతో వైవీ స్ట్రీట్, బీకేయం స్ట్రీట్, ఎస్‌ఎఫ్‌ఎస్ స్ట్రీట్, మునిరావువీధి, పాలెంపాపయ్య స్ట్రీట్, పాతమార్కెట్ వెళ్లే ప్రాంతాల్లో పలు నిర్మాణాలు నిలిచిపోయాయి. ఆ సారు రాకతో ఇప్పుడు పరిస్థితి మారింది. నిలిచిపోయిన నిర్మాణాలు మళ్లీ మొదలయ్యాయి.

అవును వాళ్లిద్దరే

కడపలో కార్పొరేషన్ పరిధిలో అనుమతులు లేని లేఅవుట్లు, భవన నిర్మాణాలు సాగకూడదని ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి కంకణం కట్టుకున్నారు. ఇందులో భాగంగా ఇరిగేషన్ స్థలంలో చేపట్టిన అనుమతులు లేని లేఅవుట్లలో నిర్మాణాలను కూల్చివేశారు. పలు అనుమతులు లేని కట్టడాలు పరిశీలించారు. అయితే.. వీరి ఆశయానికి భిన్నంగా జమ్మలమడుగు ప్రాంతానికి చెందిన వ్యక్తి కడపలో టీడీపీ నేతగా చెలామణి అవుతూ ఆ అధికారితో కలిసి అక్రమాలకు పాల్పడుతున్నారు. వీరిద్దరూ అక్రమభవన నిర్మాణాలను గుర్తించడం, వారితో నేరుగా డీల్ కుదుర్చుకుని సెటిల్‌మెంట్లు చేసుకున్నారని చెబుతున్నారు. ఈ జమ్మలమడుగుకు చెందిన వ్యక్తే పొట్లదుర్తిలో టీడీపీ నేత సీఎం సురేశ్‌నాయుడుకు వ్యతిరేకంగా వైసీపీ నిర్వహించిన ఆందోళనలో పాల్గొనడం గమనార్హం. జమ్మలమడుగులో అక్కడ తాను ఓ వైసీపీ నేత అనుచరుడిని అంటూ.. ఇక్కడ అధికార పార్టీ ముఖ్యనేతను అని చెప్పుకుంటున్నారు. ఆయన, ఈ అవినీతి సారు ఇద్దరూ పొద్దునే రైడింగ్ చేసి నిర్మాణాలు గుర్తించి డీల్ చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై సిటీ ప్లానర్ వెంకటరమణను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



బీకేఎం స్ట్రీట్‌లో సాగుతున్న భవన నిర్మాణం

---

16 న విచారణకు రావాలంటూ..

మేయర్ సురేశ్‌బాబుకు నోటీసులు

- నోటీసులు తీసుకోని మేయర్?

(కడప-ఆంధ్రజ్యోతి): విచారణకు రావాలంటూ కడప మేయర్ సురేశ్‌బాబుకు నోటీసులు ఇవ్వగా ఆయన తీసుకోలేదని తెలిసింది. వివరాలు ఇలా.. జీహెచ్ఎంసీ యాక్ట్‌కు విరుద్ధంగా మేయర్ సురేశ్‌బాబు తన భార్య కె.జయశ్రీ, కుమారుడు కె.అమరేశ్ పేరుతో ఉన్న వర్ధిని కన్‌స్ట్రక్షన్‌కు కార్పొరేషన్‌లో పనులు కేటాయించగా కొన్ని పూర్తి చేశారు. దీనిపై కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ విచారణ చేపట్టి మేయర్ నిబంధనలు ఉల్లంఘించారని తేల్చారు. దీంతో ప్రభుత్వం ఆయనపై అనర్హత వేటు వేయడంతో మేయర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు స్టేటస్‌కో ఇచ్చింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 16న సాయంత్రం 3గంటలకు అమరావతిలోని మున్సిపల్ సెక్రటరీ ఎదుట హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను కమిషనర్ మనోజ్‌కుమార్‌రెడ్డి మేయర్‌కు ఇచ్చేందుకు మంగళవారం ప్రయత్నించగా ఆయన తీసుకోలేదని తెలిసింది. నోటీసులు రేపు తీసుకుంటానని మేయర్ చెప్పారని కమిషనర్ వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మరోసారి ట్రై చేస్తాం, లేకుంటే ఆయన ఇంటికే నోటీసులు అంటిస్తామని ఆంధ్రజ్యోతికి కమిషనర్ వెల్లడించారు.

ట్రిపుల్‌ఐటీలకు 50,541 దరఖాస్తులు

వేంపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో చేరేందుకు 50,541 దరఖాస్తులు వచ్చాయని రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ సంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ విడుదల అయ్యాక మొదటి విడతలో 49,201 దరఖాస్తులు రాగా వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు రెండో విడతలో జూన్ 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు ఇచ్చామని తెలిపారు. ఈ సమయంలో 1,340 మంది దరఖాస్తు చేసుకున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. త్వరితగతిన దరఖాస్తులను పరిశీలించి ఎంపిక జాబితా త్వరలోనే విడుదల చేస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రానికే ప్రొద్దుటూరు తలమానికం

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పసిడిపురిగా పేరుగాంచిన ప్రొద్దుటూరు పట్టణం రాష్ట్రానికే తలమానికమని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో ప్రొద్దుటూరులో గోల్డ్ జ్యువెలరీ మేకింగ్ క్లస్టర్ ఏర్పాటుపై ప్రొద్దుటూరు గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువుపట్టు అయిన పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకు రావాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులను పెపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అదే దిశగా పసిడిపురిగా పేరు గాంచిన ప్రొద్దుటూరు పట్టణంలో రాష్ట్రానికే తలమానికంగా గోల్డ్ జ్యువెలరీ మేకింగ్ క్లస్టర్(జీజేఎంసీ) ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. బంగారు వ్యాపారంలో రెండవ బాంబేగా ప్రసిద్ధి చెందిన ప్రొద్దుటూరు పట్టంలో జీజేఎంసీ ఏర్పాటు అయితే బంగారు నగలతయారీ రంగంలో జిల్లాకు దేశ వ్యాప్తంగా గుర్తింపు వస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జెడ్ఎం శ్రీనివాసమూర్తి, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, ఎల్డీఎం జనార్థనం, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రంగరాజు, పశు సంవర్థక శాఖ జేడీ శారదమ్మ, ప్రొద్దుటూరు గోల్డ్ మర్చంట్స్ పాల్గొన్నారు.

మహిళలకు క్షమాపణ చెప్పాలి

- బద్వేలులో తెలుగు మహిళల ర్యాలీ

బద్వేలుటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మహిళలను అవమానించిన వారు కాలగర్భంలో కలసిపోవడం ఖాయమని, ఇప్పటికైనా సాక్షి యాజమాన్యం మహిళలకు క్షమాపణలు చెప్పాలని నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి, ఝాన్సీ, సునీత అన్నారు. మహిళలపై అసభ్యకర వాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ మంగళవారం బద్వేలు పట్టణంలోని జాతీయ రహదారిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలను కించపరిచేలా మాట్లాడుతున్న వైసీపీ నేతలు, సాక్షి చానల్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి తొలి నుంచి మహిళలంటే చిన్నచూపేనని, కన్నతల్లిని, తోడబుట్టిన చెల్లినే గౌరవించలేని వ్యక్తి మహిళలను ఎలా గౌరవిస్తారో అర్థం చేసుకోవాలన్నారు. గత ఎన్నికల్లో ఘోరంగా ఓటమి చెందిన వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదని, అహంకారం తగ్గలేదని, దానికి నిదర్శనం అమరావతి మహిళలపై అనుచిత వాఖ్యలు చేయడమేనన్నారు. కార్యక్రమంలో టీడీపీ మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



రాష్ట్ర మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ బద్వేలులో ర్యాలీ

ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం

కడప ఎడ్యుకేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్స్ బదిలీల కౌన్సెలింగ్ ఎట్టకేలకు మాన్యువల్ పద్ధతిలో మంగళవారం కడప నగరం శంకరాపురం స్కౌట్ హాల్‌లో ప్రారంభమైంది. ఉపాధ్యాయులు బదిలీల కౌన్సెలింగ్ వీక్షించేందుకు స్కౌట్ హాలు బయట రెండు ఎల్‌సీడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. అయితే అమరావతి సీఎస్ఈ నుంచి లింక్ రావడం ఆలస్యం కావడంతో రాత్రి 7గంటలకు బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఎస్జీటీ తెలుగు, ఉర్దూ ఉపాధ్యాయులకు సంబంధించి 2,301 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 8సంవత్సరాలు సర్వీస్ పూర్తయి తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారు 1,410 మంది ఉన్నారు. మిగతా ఉపాధ్యాయులు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కాగా.. మాన్యువల్ బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం కావడానికి ముందు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులతో కడప, అన్నమయ్య జిల్లాల విద్యాశాఖ అధికారులు షంషుద్దీన్, సుబ్రమణ్యం సమావేశం అయ్యారు. బదిలీలకు సంబంధించి విధి విధానాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ, ఎస్టీయూ, యూటీఎఫ్, ఆపస్, ఎస్ఆర్టీఎఫ్, ఎస్టీఎఫ్, పీఎస్టీయూ, వైఎస్సార్‌టీఏ, ఎస్టీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ సంఘాలతో డీఈఓలు షంషుద్దీన్, సుబ్రమణ్యం సమావేశం

కొమ్మినేని అరెస్టును ఖండిస్తున్నాం

- మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ జర్నలిస్టు కొమ్మినేని అరెస్టును ఖండిస్తున్నామని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా తెలిపారు. మంగళవారం కడప నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎవరో విశ్లేషకుడు సాక్షి టీవీలో మాట్లాడితే దానికి వైఎస్ జగన్, వైఎస్ భారతీలకు ఏం సంబంధం అని ప్రశ్నించారు. ఎనలిస్ట్ మాట్లాడితే దానికి కొమ్మినేని అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. రెడ్ బుక్ రాజ్యాంగం పరాకాష్టకు చేరిందని మండిపడ్డారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎంతోమంది జగన్‌పై దుర్భాష లాడినా వారిపై కక్ష సాధించలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తోట కృష్ణ, షఫి, దాసరి శివప్రసాద్ పాల్గొన్నా రు.

మట్టిని మింగేస్తున్నారు

- కాంట్రాక్టు పనుల కోసం కుందూ మట్టి తరలింపు
- ఏడాదిగా కొనసాగుతున్న వ్యవహారం

దువ్వూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కుందూ నదిని ఆనుకుని పైతట్టున ఉన్న మట్టిని కొల్లగొడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కుందూ నది విస్తరణ పనుల కోసం అందులోని మట్టిని పైతట్టుకు తరలించి పెద్ద ఎత్తున కుప్పలుగా పోశారు. దీనిపై కన్నుపడిన టీడీపీ, వైసీపీ నేతల అనుచరులు ఈ మట్టిని అక్రమంగా తీసుకుపోతున్నారు. కానగూడూరు సమీపంలోని కుందూ నది వద్ద ఈ వ్యవహారం చాలా రోజులుగా కొనసాగుతోంది. రాజుపాళెం, కానగూడూరు ప్రాంతాల్లో మట్టి ఏమాత్రం అవసరమైనా అక్రమార్కులు ఇక్కడ వాలిపోతున్నారు. రాజుపాళెం ప్రాంతంలో అధికార పార్టీకి చెందిన మండలస్థాయి నేతలు వారి కాంట్రాక్టు, ఇతరత్రా పనులకోసం ఇక్కడ ఎక్స్‌కవేటర్‌ను పెట్టి అనుమతులు లేకుండా మట్టిని టిప్పర్ల ద్వారా తీసుకెళుతున్నారు. ఇదేమని ఎవరైనా అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారు. రాజుపాళెంకు చెందిన వ్యక్తులు కొందరు ఈ మట్టి విక్రయాల్లో కీలకపాత్ర వహిస్తున్నట్లు తెలుస్తోంది. కానగూడూరు ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతోంది. దీంతో ప్లాట్లకు టిప్పర్లు పెట్టి మట్టి తరలించినట్లు కానగూడూరు వాసులు తెలిపారు.



కానగూడూరు వద్ద కుందూను ఆనుకుని ఉన్న మట్టికుప్పను తవ్వుతున్న ఎక్స్‌కవేటర్



అధికారుల రాకతో నిలిచిపోయిన ఎక్స్‌కవేటర్, టిప్పర్

మట్టి తరలిస్తే చర్యలు తప్పవు

కుందూ నది ఆనుకుని ఉన్న మట్టిని ఎవరు తరలించినా చర్యలు తప్పవు. అవసరమైతే అక్రమార్కులపై కేసు పెడతాం. మా సిబ్బందిని అక్కడికి పంపి మట్టి తరలించకుండా చర్యలు తీసుకుంటున్నాం. మట్టి అవసరమైతే చట్టబద్ధంగా అనుమతులు తీసుకోవాలి.

- పవన్‌కుమార్‌రెడ్డి, కేసీకెనాల్ ఏఈ, దువ్వూరు

ఆలస్యంగా మేల్కొన్న అధికారులు

మట్టి అక్రమ రవాణాను అరికట్టే విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు ఆలస్యంగా మేల్కొన్నారు. దువ్వూరుకు చెందిన కేసీ కెనాల్ సిబ్బంది ఒకరు వారి పైఅధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మట్టి తరలింపు వద్దకు వెళ్లి తాత్కాలికంగా నిలుపుదల చేశారు.

ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా రవిచంద్రారెడ్డి

- ఎనిమిది నెలలకే మల్లికార్జున బదిలీ

ప్రొద్దుటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా అకౌంట్స్ డిపార్ట్‌మెంటు నుంచి రవిచంద్రారెడ్డి నియమితులయ్యారు. ఇక్కడున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను హిందూపురానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. మల్లికార్జున వచ్చి ఎనిమిది నెలలు తిరగకముందే బదిలీ అయ్యారు. ఈయన బదిలీని నిలపాలంటూ ప్రొద్దుటూరు సీపీఐ ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ప్రొద్దుటూరు అభివృద్ధి విషయంలో సమర్థవంతంగా పనిచేసిన మల్లికార్జున అనతికాలంలోనే బదిలీపై వెళ్లడంతో పలువురు విస్మయం వ్యక్తం చేశారు.

మున్సిపల్ ఉద్యోగుల బదిలీలు..

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ నుంచి రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాసరావు గుంతకల్లుకు బదిలీ అయ్యారు. అకౌంట్స్ ఆఫీసర్ రామిరెడ్డి తాడేపల్లిగూడెంకు వెళ్లారు. ఏఏఓ రమేశ్‌బాబు నంద్యాలకు బదిలీ కాగా, అక్కడ నుంచి డేవిడ్ ఏఏఓగా ప్రొద్దుటూరుకు నియమితులయ్యారు. సీనియర్ అసిస్టెంటు విభాగంలో ప్రొద్దుటూరు నుంచి నూర్ అహ్మద్ మైదుకూరుకు బదిలీ కాగా, మైదుకూరులో ఉన్న సిగ్బతుల్లా ప్రొద్దుటూరుకు వచ్చారు. ప్రొద్దుటూరు నుంచి డిప్యుటేషన్‌పై పెనుగొండలో ఉన్న వినోద్‌కుమార్ కర్నూలు గూడూరుకు బదిలీ అయ్యారు. రాజంపేటలో ఉన్న నరేశ్ ప్రొద్దుటూరుకు నియమితులయ్యారు. జూనియర్ అసిస్టెంట్ విభాగంలో ప్రొద్దుటూరు నుంచి శివచరణ్‌రెడ్డి రాజంపేటకు బదిలీ కాగా, సుధాకావ్య ఎర్రగుంట్లకు, వల్లభ బద్వేలుకు బదిలీ అయ్యారు. పులివెందుల నుంచి బీవీ సుబ్బారెడ్డి ప్రొద్దుటూరుకు, జమ్మలమడుగు నుంచి విజయబాబు, బద్వేలు నుంచి శ్రీనివాసులరెడ్డి ప్రొద్దుటూరుకు బదిలీపై వచ్చారు. ప్రొద్దుటూరు నుంచి కమలాపురంలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న షఫి రాయచోటికి బదిలీ అయ్యారు.

ఇంజనీరింగ్ విభాగంలో..

ప్రొద్దుటూరు మున్సిపల్ ఇంజనీరుగా కుడా ఈఈ ఎం.శ్రీనివాసులు బదిలీపై నియామకం అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న డీఈలు దస్తగిరి హిందూపురంకు, ప్రభాకర్‌దాస్ ధర్మవరం మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. వారి స్థానంలో అనంతపురం నుంచి కడపలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న మొగలిచెండు రాజేశ్, రాజంపేటలో పనిచేస్తున్న ఈశ్వర్‌రెడ్డి ప్రొద్దుటూరుకు డీఈలుగా వచ్చారు. ప్రొద్దుటూరులో ఏఈగా ఉన్న బ్యూలా ఆదోనికి, కడప నుంచి కె.సురేశ్ ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు.



టమోటా మార్కెట్ నిర్వహణపై అధికారుల నిర్లిప్తతతో అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయి. రైతుల వాహనాలు మార్కెట్‌లోకి రావడం నుంచి.. వ్యాపారుల లారీలు బయటకు వెళ్లడం వరకూ అన్నీ సమస్యలే. ఈ అంశాలన్నీ చివరకు రైతులు, వ్యాపారులతోపాటు ధరలపైకూడా ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా ఈ మార్కెట్‌కు రోజూ వచ్చే సరుకు, కొనుగోలుదారులు, ధరల వివరాలను ఇతర మార్కెట్‌లతో పోల్చి చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ ఓ పద్ధతి, నియమం, పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణం. మార్కెట్‌కు వచ్చే సరుకుకు అనుగుణంగా విశాలమైన స్థలం లేకపోవడం.. ఉన్నా సరైన పద్ధతిలో వినియోగించుకోక పోవడంతో ట్రాఫిక్ సమస్యలు కూడా ఇబ్బందికరంగా మారుతున్నాయి.

- పెరుగుతున్న సాగు విస్తీర్ణం.. ● మార్కెట్‌ను ముంచెత్తుతున్న దిగుబడులు
- రోడ్లను ఆక్రమించిన వ్యాపారులు
- బారులు తీరిన వాహనాలు ● గంటల తరబడి నిరీక్షణ
- బయటి మార్కెట్లకు కొనుగోలుదారులు ● ధరలపై ట్రాఫిక్ ప్రభావం

టమోటా మార్కెట్ అస్తవ్యస్తం!

మదనపల్లె, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోటా మార్కెట్‌కు ఆసియాలోనే పెద్దమార్కెట్‌గా పేరుంది. అయితే ఆ స్థాయిలో ఇక్కడ సౌకర్యాలు, వసతులు లేవు. 1985లో అప్పటి సాగు విస్తీర్ణాన్ని బట్టి స్థానిక నీరుగట్టువారిపల్లె సమీపంలో 20 ఎకరాల్లో టమోటా మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో కొందరు రైతులు మాత్రమే టమోటా సాగు చేస్తుండగా, ప్రస్తుతం వ్యాపారులు, ఉద్యోగులు, అన్ని వర్గాలవారు టమోటా సాగు చేస్తున్నారు. దీంతో ఏటికేడు పంట సాగు విస్తీర్ణంతోపాటు దిగుబడి కూడా గణనీయంగా పెరుగుతోంది. అదే ఇప్పుడు అన్ని సమస్యలకు కారణమవుతోంది. ఒకప్పుడు సీజన్‌లో మాత్రమే సాగయ్యే టమోటా.. ప్రస్తుతం సీజన్‌తో పనిలేకుండా ఏడాది పొడవునా ఉంటోంది. ప్రధానంగా ఫిబ్రవరిలో పంటసాగు మొదలై.. నవంబరు వర్షాలతో పూర్తవుతుంది. ఈ మధ్య కాలంలో ధరలు రైతుల దశ, దిశను మార్చేస్తుంటాయి. వస్తే లాభం, లేకుంటే నష్టం, మధ్యతరహాగా తీసుకుంటే పెట్టుబడి వస్తుంటుంది. దీంతో ఒక పంటలో నష్టం వచ్చినా, మరో పంట ఆదుకుంటుందనే నమ్మకంతో ప్రతిరైతు దాదాపుగా మూడు అదున్లలోనూ కొంత విస్తీర్ణంలో సాగు టమాటా చేస్తుంటాడు.

వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య

జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాలతోపాటు సమీపంలోని కర్ణాటక ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా ఈఏడాది విస్తారంగా టమోటా సాగైంది. మే నెల రెండోవారం నుంచే మొదలైన దిగుబడి.. క్రమంగా పెరుగుతోంది. 500 మెట్రిక్ టన్నుల నుంచి మొదలైన టమోటా దిగుబడి.. ప్రస్తుతం రెండువేల టన్నులను దాటేసింది. ధరలు కూడా ఇదే స్థాయిలో హెచ్చుతగ్గులతో కదులుతున్నాయి. మదనపల్లె మార్కెట్‌లో ఆదివారం గరిష్ఠంగా 28 కేజీల క్రేట్ రూ.500 నుంచి రూ.550 వరకు పలికింది. ఇక రెండో రకం రూ.350-400, మూడో రకం రూ.300-రూ.250 పలికింది. దిగుబడులు, ధరల విషయాన్ని పక్కన పెడితే, అటు రైతులు, ఇటు వ్యాపారులను ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతున్నాయి.

తాజా సాగు విస్తీర్ణం, దిగుబడులను పరిగణలోకి తీసుకుంటే.. ఇప్పుడు మార్కెట్‌కు మరింత విశాలమైన స్థలం కావాల్సి ఉంది. ఇప్పుడున్న 20 ఎకరాల్లో అయిదు ఎకరాలు ఇతర విభాగాలకు పోగా, మిగిలిన 15 ఎకరాల్లో 50 వరకూ కమీషన్, ట్రేడ్ లైసెన్సు మండీలు నడుస్తున్నాయి. ఉన్న మండీ యజమానులు స్థలాలతోపాటు రోడ్లను కూడా ఆక్రమించేశారు. కొంత రోడ్డు ఉన్నా.. అక్కడికి వచ్చే ట్రాక్టర్లు, లారీలను లోడింగ్ పేరుతో గంటల తరబడి నిలిపేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో రైతుకు చెందిన ట్రాక్టరు లోపలికి వెళ్లాలన్నా, వ్యాపారికి చెందిన లారీ బయటకు రావాలన్నా కనీసం పది గంటల సమయం పడుతోంది. దీంతో కొనుగోలు చేసిన సరుకును సమయానికి బయటి మార్కెట్‌కు చేర్చలేక వ్యాపారులు, సరుకును మార్కెట్‌కు తెచ్చే రైతు మండీకి వెళ్లడానికి నిరీక్షించలేక సహనం కోల్పోతున్నారు. దీంతో కొందరు రైతులు, వ్యాపారులు బయటి మార్కెట్లకు తరలిపోతున్నారు. ఈ పరిస్థితి ధరలపై ప్రభావం చూపుతోంది.

బారులుతీరుతున్న వాహనాలు

బయటి ప్రాంతాల నుంచి వచ్చే రైతుల ట్రాక్టర్లు నీరుగట్టువారిపల్లెలోని మార్కెట్‌యార్డు ఎదుట బారులు తీరుతున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు క్యూలో వచ్చి నిలబడితే, లోపలకు వెళ్లడానికి సాయంత్రం ఆరు అవుతోంది. అక్కడ మండీలో కాయలను అన్‌లోడ్ చేసి, తిరిగి బయటకు రావడానికి రాత్రి పది గంటలు అవుతోంది. ఇలా రోడ్డుపై నిరీక్షిస్తున్న ట్రాక్టర్లు, మినీ వ్యాన్‌లు మార్కెట్ నుంచి అమ్మచెరువుమిట్ట, అటు గొల్లపల్లె బైపాస్‌రోడ్డు వరకూ బారులు తీరుతున్నాయి. అలాగే మండీలలో కొనుగోలు చేసిన టమోటాలను బాక్సులు మార్చి లోడ్ చేసి బయటకు తరలించడానికి ఆరేడు గంటలు పడుతోంది. దీంతో వ్యాపారుల లారీలు బయటకు వెళ్లే వరకూ అప్పటికే మార్కెట్‌కు కాయలు తెచ్చిన వాహనాలు రోడ్డుపై నిరీక్షించాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని ఎవరూ అదుపు చేయలేకపోతున్నారు. చివరకు మార్కెట్ మార్కెట్ అధికారులు కూడా చేతులెత్తేస్తున్నారు. అలాగే చౌకదుకాణాలకు బియ్యం, ఇతర నిత్యావసరాలు సరఫరా చేసే గోదాము కూడా ఇక్కడే ఉండటంతో లారీలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ నిత్యావసర వస్తువులు సకాలంలో రేషన్‌షాపులకు సరఫరా చేయలేక పోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన కొన్నేళ్లుగా అమలుకు నోచుకోవడం లేదు. ఇదిలా ఉండగా, కొన్ని మండీల యజమానులు స్థానిక టిప్పుసుల్తాన్ మైదానంలో తాత్కాలికంగా మండీలు నిర్వహిస్తున్నారు. కొందరు రైతులు సైతం సమీపంలోని ఇతర మార్కెట్ల కాయలను తీసుకెళ్తుండగా, వ్యాపారులు కూడా అక్కడికే వెళ్తున్నారు. ఈ పరిస్థితి ప్రధాన మార్కెట్‌లో ధరలపై ప్రభావం చూపుతోంది. ఇక మార్కెట్‌లో శానిటేషన్ పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఈ అంశాలపై అధికారులు దృష్టి సారిస్తే తప్ప.. పరిస్థితి మెరుగుపడదని అటు రైతులు, ఇటు వ్యాపారులు వాపోతున్నారు.



మార్కెట్‌కు వచ్చిన టమోటాలు



నీరుగట్టువారిపల్లెలో రోడ్డుపై బారులు తీరిన వాహనాలు



ట్రాఫిక్ సమస్యతో మార్కెట్‌లో నిలిచిపోయిన వాహనాలు

ప్రజా దర్బార్‌తో సమస్యలకు తక్షణ పరిష్కారం

రాయచోటిటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో రాయచోటి నియోజకవర్గంలోని ప్రజలు సమస్యలు పరిష్కారానికి నోచుకోక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి నియోజకవర్గంలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను మంత్రి స్వీకరించి వాటిని అక్కడికక్కడే పరిష్కరించామన్నారు.



సమస్యలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

ఎన్‌బీకే ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం

మదనపల్లె టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ జన్మదినం సందర్భంగా మదనపల్లె టీడీపీ నేత లోకేశ్ కొణెదల హైదరాబాద్‌లో మంగళవారం బాలకృష్ణను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్‌బీకే ట్రస్టుకు రూ.5,55,555 విరాళం అందజేశారు. మదనపల్లెలో టీడీపీ బలోపేతానికి మరింత కృషి చేయాలని సూచించినట్లు లోకేశ్ మీడియాతో తెలిపారు.



సినీహీరో బాలకృష్ణకు చెక్కు అందజేస్తున్న లోకేశ్ కొణెదల

అండర్‌పాస్ ఏర్పాటుతో.. దారి సమస్య పరిష్కారం

వాల్మీకిపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పనుల కారణంగా పట్టణ సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్ ప్రాంతంలో పొలాలకు వెళ్లేందుకు దారి సమస్య ఏర్పడిందని ఏడాది క్రితం రైతులు రహదారి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎన్‌హెచ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా అండర్ పాస్ ఏర్పాటు చేశారు. దాదాపుగా 400 ఎకరాలకు పైగా సాగు భూములు ఉన్న ప్రాంతంలో జాతీయ రహదారి పనులు చేపట్టడంతో తమ పొలాలకు దారి లేకుండా పోతుందేమోమని ఆందోళన చెందామని, ఒకవేళ జాతీయ రహదారి పూర్తి చేసి ఉంటే తమ భూములకు దారి మాట ఎలా ఉన్నా సుమారు 4 నుంచి 5 కిలోమీటర్లు ప్రదక్షిణ చేయాల్సి వచ్చేదన్నారు. భోగం పల్లె రిజర్వాయర్ కుడికాలువ పనులతో పాటు తమ పొలాలకు అను గుణంగా అండర్ పాస్ నిర్మాణం పూర్తి చేయడంపై రైతులు ఎన్‌హెచ్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



భోగంపల్లె రిజర్వాయర్ సమీపంలో ఏర్పాటు చేసిన అండర్‌పాస్

నరసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు

గుర్రంకొండ, జూన్ 10 (ఆంధ్ర జ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వారి హుండీని మంగళవారం టీటీడీ అధికారులు లెక్కించారు. ప్రతి మూడు నెలలకోసారి స్వామి వారి హుండీని లెక్కిస్తారు. స్వామి వారికి హుండీ ద్వారా రూ.14,84,740 ఆదాయం వచ్చినట్లు ఆలయాధికారి కృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



హుండీని లెక్కిస్తున్న అధికారులు

మదనపల్లె సబ్‌జైలు సూపరింటెండెంట్ బదిలీ

మదనపల్లె టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె స్పెషల్ సబ్‌జైలు సూపరింటెండెంట్ రామకృష్ణ బదిలీ అయ్యారు. ఐదేళ్లకు పైగా ఇక్కడ విధులు నిర్వహించిన ఆయనను తిరుపతి సబ్ జైలు సూపరింటెండెంట్‌గా నియమిస్తూ జైళ్లశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం జైలు సిబ్బంది ఆయనకు వీడ్కోలు పలికారు. మదనపల్లె సబ్ జైలు సూపరింటెండెంట్‌గా రాజమండ్రి సబ్‌జైలులో పని చేస్తున్న కె.లక్ష్మణరావు నియమితులయ్యారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్ష

రాయచోటిటౌన్, జూన్10(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పరిధిలోని మదనపల్లె, రాజంపేట, రాయచోటి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆరు పరీక్ష కేంద్రాల్లో డీఎస్సీ పరీక్షలు అత్యంత పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నా రు. జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారులు మదనపల్లెలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాల, మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు రాజంపేటలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల, ఆస్కార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలను పర్యవేక్షించారు మంగళవారం 6 పరీక్ష కేంద్రాల్లో 1558 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1446 మంది హాజరు కాగా 112 గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలియజేశారు.

బాలిక మృతిపై విచారణ చేయాలి

మదనపల్లె టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంజునాథ కాలనీలో బాలిక మృతిపై పోలీసులు సమగ్ర విచారణ చేయించాలని ఐద్వా కన్వీనర్ భాగ్యమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద మస్తాని తల్లిదండ్రులు గఫూర్, హసీనాలను ఐద్వా నాయకురాళ్లు పరామర్శించారు. మస్తాని ఎలా మృతి చెందింది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. భాగ్యమ్మ మాట్లాడుతూ మస్తాని మృతి వివరాలు తెలిపేందుకు ఆమె తల్లిదండ్రులు భయపడుతున్నారని, పోలీసులు నిష్పక్ష పాతంగా దర్యాప్తు చేసి న్యాయం చేయాలని వారు కోరారు.

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి

- స్కౌట్స్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి

రాజంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించుకోవాలని స్కౌట్, గైడ్స్ జిల్లా కార్యదర్శి ఎం.నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రాజంపేట బాలికోన్నత పాఠశాలలో గైడ్స్ విద్యార్థులకు గత 5 రోజులుగా నిర్వహిస్తున్న తృతీయ సోపాన్, రాజ్య పురస్కార్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నిజాయితీ, సేవా గుణం, ధైర్య సాహసాలు పెంపొందుతాయన్నారు. స్కౌటిజం ద్వారా మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు. స్కౌట్ శిక్షణ పొంది సర్టిఫికెట్లు ఉన్న విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ ఉంటుందన్నారు. కావున, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అసిస్టెంట్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తృతీయ సోపాన్ శిక్షణకు 92 మంది, రాజ్య పురస్కార్ శిక్షణకు 12 మంది గైడ్స్ విద్యార్థులు హాజరయ్యారన్నారు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఏవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలి, నైతిక విలువలు, దేశభక్తి, సేవాభావం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు జయలక్ష్మి, గైడ్స్ లీడర్, ట్రైనర్ శకుంతల, హెచ్‌డబ్ల్యూ బి.నిర్మల, అడ్వాన్స్ గైడ్ కెప్టెన్‌లు శివలీల, కనకదుర్గ, సుజాత, బేసిక్ గైడ్స్ కెప్టెన్‌లు గోవిందమ్మ, శ్యామల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి

సీసీ వైఖరికి నిరసనగా డ్వాక్రా సభ్యుల ఆందోళన


సిద్దవటం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా డ్వాక్రా సీసీ ప్రవర్తించడం తగదని డ్వాక్రా మహిళలు అన్నారు. సిద్దవటం మండలం మాధవరం-1లో మంగవారం వారు మాట్లాడుతూ సిద్దవటం మండలం మాధవరం-1 పరిధిలోని యానిమేటర్‌గా పనిచేస్తున్న సులోచన కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడేవారన్నారు. అప్పట్లో సంబంధించిన అధికారులు ఆదేశించిన పనులను నిర్వర్తించడంలో ఆమె విఫలమయ్యారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని సంబంధిత సీపీ ఆమెను తప్పించాలన్న ఉద్దేశంతో నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆమె కోలుకుని విధులను నిర్వర్తించడానికి సిద్ధంగా ఉన్నా సీసీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించారన్నారు. గతంలో ఆమె విధులు సక్రమంగా నిర్వహిస్తూ లక్ష్యాలను సాధించారన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు విచారించి ఆమెకు తగు న్యాయం చేయాలని, ఆమెను విధుల్లో కొనసాగించాలని డ్వాక్రా సభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఏపీఎం సుజాతను వివరణ కోరగా జరిగిన విషయం పరిశీలించి తగు న్యాయం చేస్తామని ఆమె సూచించారు.



ఆందోళన చేస్తున్న మహిళలు

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

మదనపల్లె టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సీటీఎం రోడ్డులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నిబంధనలు విరుద్ధంగా కడుతున్న కమర్షియల్ భవనాలపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ ఫిర్యాదు చేశారు. మంగళవారం సబ్ కలెక్టరేట్ డీఏఓ రాఘవేంద్రను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్టేట్‌లో కార్మికులకు ఉపాధి కల్పించే పరిశ్రమలను నెలకొల్పాలే కానీ, పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని తక్కువ ధరలకు స్థలాలు తీసుకుని, వాటిలో కమర్షియల్ భవనాలు నిర్మిస్తూ కార్మికుల పొట్టకొడుతున్నారన్నారు. దీనిపై ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా ఆయన పట్టించుకోలేదన్నారు. ఈ విషయమై విచారణ చేసి తగుచర్యలు తీసుకోవాలని పునీత్ కోరారు. హరికృష్ణ, జిలాని, నవీన్, శశికుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టరేట్ డీఏఓకు వినతి పత్రం సమర్పిస్తున్న బీవైఎస్ నేతలు

కిశోర వికాసంపై యువతులకు అవగాహన

బి.కొత్తకోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కిశోర వికాసం కార్యక్రమం ద్వారా కిశోర బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించామని బి.కొత్తకోట ప్రాజెక్టు సీడీపీఓ భాగ్యమ్మ తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని తాకాటంవారిపల్లి సచివాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, సైబర్‌నేరాలు, మహిళా రక్షణ కోసం ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలు, బాల్యవివాహాలతో అనర్థాలు, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలను శిక్షణా తరగతుల్లో వివరించామని, గ్రామాల్లో ఆయా అంగన్వాడీ కేంద్ర కార్యకర్తల ద్వారా విపులంగా తెలియపరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హిజాద్‌ప్యారీ, జీఎంఎస్కే సుమతి, వెల్ఫేర్ ఉద్యోగి మౌలా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ భాగ్యమ్మ

తంబళ్లపల్లె: బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిషోర వికాసం ఎంతగానో దోహదపడుతుందని మహిళా సంరక్షణ కార్యదర్శి భారతి అన్నారు. మంగళవారం మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో కిషోర వికాసంపై అవగాహన కల్పించారు. రక్తహీనత, ఐరన్ లోపం వలన కలిగే నష్టాలు, రక్తహీనత నివారణ, ఆరోగ్యం, పోషణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అపోర్డు సంస్థ సిబ్బంది బాల్య వివాహాలతో నష్టాలు, బాలికల విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో అంగన్వాడీ కార్యకర్తలు ఉమ, కళావతి, సరస్వతి, మహిళా పోలీసులు, మహిళలు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

కలకడ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నాటు సారా విక్రయిస్తున్న రాజానాయక్ అనే వ్యక్తి ని మంగళవారం అరెస్టు చేసినట్లు రాయ చోటి ఈఎస్‌టీఎఫ్ సీఐ ఎల్లయ్య తెలిపారు. కలకడ మండలం బాలయ్యగారిపల్లెలో అత ని నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసున్నట్లు వివరించారు. అతనికి నాటు సారా సరఫరా చేసిన సంబేపల్లె మండలం శెట్టిపల్లె పెద్దబిడికికి చెందిన ఆదిరెడ్డినాయక్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా సారా అమ్మినా, రవాణా చేసినా, దాచిఉంచినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది మోహన్‌రెడ్డి, హుస్సేన్, బాలకృష్ణ, జానీ పాల్గొన్నారు.



నిందితుడిని చూపుతున్న పోలీసులు

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

కురబలకోట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పీటీఎం మండలం ఉప్పరోళ్లపల్లెకు చెందిన లక్ష్మిదేవి (46)భర్తతో విడిపోయి, కూలి పనులు చేసుకుంటూ మదనపల్లె పట్టణం చంద్రా కాలనీలో ఒంటరిగా జీవిస్తోంది. పక్క కాలనీకి ఒక వ్యక్తితో సన్నిహితంగా ఉండేది. ఈమెకు పిల్లలు లేరు. కాగా, మంగళవారం ఉదయం మండలంలోని సర్కారు తోపు సమీపంలో జాతీయ రహదారి పక్కన చెట్టుకు ఉరేసుకున్న స్థితిలో ఆమె మృతదేహం కనిపించింది.. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ వివాదంలో దంపతులపై దాడి

కురబలకోట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): భూ వివాదం కారణంగా ప్రత్యర్థులు దంపతులపై దాడి చేసి గాయపరిచారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ బండపల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డి, వెంకటరమణారెడ్డి సోదరులు. వీరికి గ్రామంలో కొంత భూమి ఉంది. అయితే ఈ భూమి విషయమై పలుమార్లు గొడవపడ్డారు. ఈ భూమి సర్వే చేసేందుకు శ్రీనివాసులు రెడ్డి చలానా కట్టాడు. అయితే అధికారులు సర్వే చేసేందుకు రాగా ఇరువురి మధ్య వాగ్వా దం జరిగింది. దీంతో ఆగ్రహించిన వెంకట రమణారెడ్డి భార్య లక్ష్మిదేవి, కుమారులు చంద్రశేఖర్‌రెడ్డి, శివకృష్ణారెడ్డిలు శ్రీనివాసు లురెడ్డి అతని భార్య అమరావతిపై దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో అమరా వతి చేయి విరిగింది. బాధితురాలిని కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలకు రూ. 56 వేలు జరిమానా

పీలేరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలపై ఆకస్మిక దాడులు నిర్వహించి రూ. 56,510 జరిమానా వసూలు చేసినట్లు పీలేరు ఎంవీఐ విజయకుమారి తెలిపారు. మంగళవారం పీలేరు- సుండుపల్లె రోడ్డులోని కేవీపల్లె మండలం గర్నిమిట్ట వద్ద ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా, కెపాసిటీకి మించి ప్రయాణికులను తరలిస్తున్న తొమ్మిది ఆటోలను నిలిపి రూ. 56,510 జరిమానా విధించారు. ఇకపై అక్రమంగా ప్రయాణికులను తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో పీలేరు ఆర్టీసీ డీఎం పీ. నిర్మల, ఆర్టీసీ డిపో మేనేజర్ బాబునాయక్ పాల్గొన్నారు.

'పని గంటల పెంపు దుర్మార్గం'

మదనపల్లె, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గం చేసిన కార్మిక వ్యతిరేక నిర్ణయాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీయూ కార్యాలయంలో మంగళవారం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎనిమిది గంటల పని విధానం కొనసాగించాలన్నారు. రాష్ట్రంలో కార్మిక చట్టాలను మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. 50 లక్షల మంది కార్మికులకు 13 సంవత్సరాలుగా కనీస వేతనాల సవరణ జరగలేదన్నారు. 20 లక్షల మందికిపైగా పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కూటమి ప్రభుత్వం పునరుద్ధరించలేదన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోపు కృష్ణప్ప, చంద్రశేఖర్, ఏఐటీయూసీ నాయకులు మస్తాన్, ముబారక్, తిరుమల, దేవా, చలపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి ఆత్మహత్యాయత్నం

● ఇద్దరిని కాపాడిన రైల్వే పోలీసులు

● కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబం వద్దకు చేర్చిన వైనం

ఎర్రగుంట్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు చోట్ల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను రైల్వే ఆర్ఎస్ఐ రవిచంద్ర, ఆర్పీఎఫ్ బృందం కాపాడింది. వివరాల్లోకి వెళితే... పెనికలపాడు గ్రామానికి చెందిన పల్లేటి మునిస్వామి కుటుంబ కలహాలతో సోమవారం రాత్రి 9.50 గంటల ప్రాంతంలో కలమల్ల రైల్వే స్టేషన్ సమీపంలో ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చాడు. గమనించిన రైల్వేస్టేషన్ మాస్టర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జీఆర్పీ ఆర్ఎస్ఐ రవిచంద్ర, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ శివకుమార్‌లు అక్కడికి చేరుకుని మునిస్వామికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం పెనికలపాడుకు వెళ్లి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. అలాగే ఎర్రగుంట్లలో సోమవారం రాత్రి 9గంటల సమయంలో కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకునేందుకు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌కు రాగా... గమనించిన రైల్వే పోలీసులు, ఆర్ఎస్ఐ రవిచంద్ర, సిబ్బంది అతనిని కాపాడారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి వారి భార్యా పిల్లలకు అప్పగించారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

దువ్వూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లె సమీపంలోని ఫారెస్టు పరిధిలో మంగళవారం నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు అక్రమంగా దుంగలు తరలిస్తున్న దాసరిపల్లెకు చెందిన బసప్ప, సుబ్రమణ్యం, బాస్కరయ్య అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వీరు నెల కిందట 12 దుంగలు కొట్టి వాటిలో ఎనిమిది దుంగలను తరలించారని, మిగతా నాలుగు దుంగలను తరలిస్తుండగా ఫారెస్టు బీట్ ఆఫీసర్ సుచరిత, కానిస్టేబుల్ ఓబులేసుతో కలిసి నిందితులను అరెస్టు చేసి దుంగలను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు వివరించారు.

యువకుడు ఆత్మహత్య



ప్రశాంత్ (ఫైల్)

వీరపునాయునిపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లెలోని ఎస్సీకాలనీకి చెందిన లింగదారి ప్రశాంత్ (23) అనే యువకుడు ఆత్మ హత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. ప్రశాంత్ తన తల్లి చనిపోవడంతో తరుచూ మనస్థాపానికి గురయ్యేవాడు. నాలుగు రోజుల క్రితం తండ్రితో తనకు పెళ్లి చేయమని వాదనకు దిగేవాడని, పెళ్లిచేయలేదని బాధతో మద్యం మత్తులో ఇంట్లోనే ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కూల్‌డ్రింక్ షాపులో చోరీ

బద్వేలుటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని కూల్‌డ్రింక్ షాపులో మంగళవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. కూల్‌డ్రింక్ షాపునకు తాళాలు వేసినవి వేసినట్లే ఉన్నా, దొంగలు ఎంతో చాకచక్యంగా షాపు పైకప్పు బాగంలో రేకులను కట్టర్ సాయంతో కట్‌చేసి లోపలికి ప్రవేశించారు. షాపులో ఉన్న రూ.10వేల నగదు, రూ.30వేలు విలువ చేసే సిగరేట్లు తదితర సామాగ్రిని దోచు కెళ్లారు. దుకాణ దారుడు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఆరు నెలల క్రితం ఇదే తరహాలో పక్క షాపులో చోరీ జరగడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు దొంగతనాలపై నిఘా పెట్టాలని కోరుతున్నారు.

గొడ్డలితో దాడి...కేసు నమోదు

ముద్దనూరు జూన్ 10 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి దేనేపల్లెలో మంగళవారం ఉదయం బోల రామ్మోహన్‌పై గొడ్డలితో దాడికి పాల్పడిన ఐదు గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. శనివారం బోల రామ్మోహన్ ఇంటిలో ఫంక్షన్ జరిగింది. అదే గ్రామానికి చెందిన ఉత్తయ్య ఫంక్షన్‌లో తన మనుషులను పనికి పిలవకుండా వేరే వ్యక్తులను పెట్టుకున్నాడని రామ్మోహన్‌ను కొడతామని హెచ్చరించాడు. ఉదయం రామ్మోహన్ పొలంలో ఉండగా ఉత్తయ్య తన మనుషులతో కలిసి ఉద్ధేశ్య పూర్వకంగా గొడ్డలితో దాడి చేయడంతో రామ్మోహన్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఉత్తయ్య, శివ, శివశంకర్, లక్షుమయ్య, నరసింహలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లైంగిక వేధింపులు...కేసు నమోదు

మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన బోల రామ్మోహన్ అనే వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. రామ్మోహన్ పొలం పనిచేసేందుకు వెళ్లిన మహిళను లైంగికంగా వేధించడంతో తప్పించుకొని ఇంటికి వెళ్లింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రామ్మోహన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

కడప క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం కోఆపరేటివ్‌కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న భవనం రెండో అంతస్థు నుంచి పడి వెంపటి శ్రీనివాసరావు(40) మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. గుంటూరుకు చెందిన శ్రీనివాసరావు బేల్దారి పని నిమిత్తం కడపకు వచ్చారు. ఆయన పని చేస్తున్న సమయంలో పైనుంచి పడి మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి అన్న సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నలుగురు తహశీల్దార్లు బదిలీ

కడప కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా వైఎస్సార్ కడప జిల్లాలో నలుగురు తహశీల్దార్లను బదిలీచేస్తూ కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బ్రహ్మంగారిమఠంలో పనిచేస్తున్న తహశీల్దారు డి.దామోదరరెడ్డిని ఒంటిమిట్టకు, ఒంటిమిట్టలో పనిచేస్తున్న రమణమ్మను ఖాజీపేటకు బదిలీ చేశారు. ఖాజీపేటలో పని చేస్తున్న తహశీల్దారు డి. మహబూబ్‌బాషాను జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో కేఆర్‌సీసీ తహశీల్దారుగా, గోపవరం మండల తహశీల్దారుగా పని చేస్తూ కలెక్టరేట్‌లో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఆర్.జీవన్ చంద్రశేఖర్‌ను ముద్దనూరు తహశీల్దారుగా బదిలీ చేసి, అక్కడ నుంచి డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌లోని డి-సెక్షన్ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా జిల్లాలో భారీగా తహశీల్దార్ల బదిలీలు ఉంటాయని భావించారు. అధికార పార్టీ నేతలు కొందరికి రెకమెండేషన్ లెటర్స్ ఇప్పించినప్పటికీ కలెక్టర్ తనదైన శైలిలో తహశీల్దార్ల బదిలీలు చేయడం గమనార్హం. ఇకపోతే అన్నమయ్య జిల్లా నుంచి ముగ్గురు డిప్యూటీ తహశీల్దార్లు బదిలీపై జిల్లాకు రానున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 8 మంది డీటీలకు త్వరలో తహశీల్దార్లుగా పదోన్నతులు లభించే అవకాశాలున్నట్లు సమాచారం.

మహిళపై అత్యాచారం కేసులో జీవిత ఖైదు



శిక్ష పడిన ముద్దాయిని చూపుతున్న పోలీసులు

చెన్నూరు జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై అత్యాచారానికి పాల్పడ్డ కేసులో బరకం వెంకటేశ్ అనే వ్యక్తికి కడప 7వ ఏడీజే కోర్టు న్యాయ మూర్తి ఎ.రమేశ్‌కుమార్ జీవితఖైదుతో పాటు రూ.లక్షా 50 వేలు జరిమానా విధించారు. పోలీసుల కథనం మేరకు..

చెన్నూరు మండలంలోని ఓ గ్రామ సచివాలయం పరిధిలో వలంటీరుగా పనిచేస్తున్న మహిళకు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి చెందిన బరకం వెంకటేశ్ పరిచయం అయ్యాడు. ఇద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునే వారు. వెంకటేశ్ ఆ మహిళపై ప్రేమ ఉన్నట్లు నటించి పెళ్లి చేసుకుందామని నమ్మించి కడప నగరంలోని ఓ లాడ్జికి పిలిపించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆ తరువాత మహిళ పెళ్లి ప్రస్తావన తీసుకురావడంతో నిరాకరించడంతో పాటు దుర్భాషలాడాడు. దీనిపై 2021 జూన్ 20న బాధితురాలి ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేశారు. అనంతరం విచారణను అప్పటి కడప రూరల్ సీఐ మహ్మద్ అలీకి అప్పగించారు. సీఐ దర్యాప్తు చేసి వెంకటేశ్‌ను అరెస్టు చేసి కడప 7వ ఏడీజే కోర్టు జడ్జి ఎదుట విచారణకు హాజరుపరిచారు. ప్రస్తుత సీఐ క్రిష్టారెడ్డి సంబంధిత సాక్షులను సకాలంలో హాజరు పరిచారు. బాధితురాలి తరపున ఎం.యాస్మిన్ వాదనలు వినిపించారు. ఈ మేరకు వెంకటేశ్ నేరం చేసినట్టుగా రుజువు కావడంతో అతడికి జీవిత ఖైదుతో పాటు రూ.1.50 లక్షలు జరిమానా విధిస్తూ మంగళవారం జడ్జి తీర్పు ఇచ్చారు.

రైతులకు నష్టం జరుగకుండా చూడాలి : ఆర్డీవో



హైపవర్ విద్యుత్తు లైను వెళ్లే పొలాలను పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దారు తదితరులు

సీకేదిన్నె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా హైపవర్ విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయాలని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. మంగళవారం చింతకొమ్మదిన్నె గంగమ్మ ఆలయం సమీపంలో హైపవర్ విద్యుత్తు లైన్లు వెళ్లే పొలాలను సీకే దిన్నె తహసీల్దారు నాగేశ్వరరావు, రైతులు, పవర్‌గ్రిడ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైవేకు సమాంతరంగా విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని, అదే సమయంలో రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. రైతులకు అన్యాయం జరగకుండా రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని చింతకొమ్మదిన్నె చెరువు నుంచి గుట్టపై నుంచి డిజైన్ మార్చుకోవాలన్నారు. అలా కాకుండా రైతుల విలువైన భూములు కోల్పోయే విధంగా చేయరాదన్నారు. అంతకుముందు చింతకొమ్మదిన్నె, కొలుములపల్లె, జమాల్‌పల్లి, ఇప్పెంట, తదితర గ్రామాల రైతులు పవర్‌గ్రిడ్ స్టేషన్‌కు వెళ్లి నిరసన తెలిపేందుకు వెళ్లారు. అయితే ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న 765 కేవీ విద్యుత్తు లైను డిజైన్లు పవర్‌గ్రిడ్‌వారు చేయడం లేదని.. స్టెరిలైట్ కంపెనీ వారు చేస్తున్నారని తెలుసుకుని రైతులు తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో తహసీల్దారు రైతుల ఇబ్బందులను ఆర్డీవోకు వివరించడంతో ఆర్డీవో స్వయంగా వచ్చి రైతుల భూములను, విద్యుత్తు లైను వెళ్లే మార్గాన్ని పరిశీలించి వారికి డిజైన్ మార్చుకోవాలని సూచించారు. అదే విధంగా ఈ కంపెనీ వారు ఈనెల 10లోగా తమ అభ్యంతరాలు తెలియజేయాలని పత్రికా ప్రకటన ఇచ్చి ఆ అడ్రస్‌లో వారు లేకపోవడంతో అభ్యంతరాలు తెలిపేందుకు తాము ఢిల్లీకి వెళ్లి ఎన్నో వ్యయప్రయాసలకు గురైనట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జిల్లా సహకార అధికారిగా వెంకటసుబ్బయ్య



కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార అధికారిగా ఎం.వెంకటసుబ్బయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుదీర్ఘకాలంగా ఈ పోస్టును ఇన్‌చార్జి అధికారులతోనే నెట్టుకొచ్చారు. నంద్యాలలో పనిచేస్తూ కడప డీసీవోగా నియమితులైన వెంకట సుబ్బయ్య గతంలో మెప్మా పీడీగా, డీఆర్‌డీఏ పీడీ, ఎస్ఎస్ఏ పీవోగా జిల్లాలో పనిచేశారు. ఎన్టీఆర్ జిల్లా సహకార అధికారిగా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరెడ్డిని ప్రొద్దుటూరు లోని సహకార శిక్షణ కేంద్రం అధ్యాపకుడుగా నియమించారు. కడప జిల్లా మైన్స్ జియాలజీ అధికారిగా డి.వెంకటసాయిని నియమించారు. గుంటూరు జిల్లాలో డీఎంజీవోగా ఆయన ఇప్పటి వరకు విధులు నిర్వహించే వారు. బాపట్ల ఏడీఎంగా పనిచేస్తున్న ఆర్.రాజేశ్‌కుమార్‌ను రాయచోటి డీఎంజీవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పరారీలో ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ

పులివెందుల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి పరారీలో ఉన్నారు. పోలీసు వర్గాల కథనం మేరకు.. మహానాడు సందర్భంగా గత నెల 28వ తేదీన టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పులివెందులలోని పార్నపల్లె రింగురోడ్డు సర్కిల్ నుంచి కడప రింగురోడ్డు సర్కిల్ వరకు ఆయా సర్కిళ్లలో టీడీపీ తోరణాలు, ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేశారు. అయితే వైసీపీకి చెందిన కొంతమంది వీటిని పీకేసి, ఫ్లెక్సీలను చించేశారు. అదే సమయంలో వైసీపీకి చెందిన వారు మారణాయుధాలతో తనను చంపేందుకు వెంబడించారని టీడీపీ నేత విజయ్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పట్లోనే 15 మందిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసులో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్‌తో పాటు 13 మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. మిగిలిన ఇద్దరూ ఇంకా పోలీసులకు చిక్కలేదు. వీరిలో అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి కేసు నమోదైన రోజు నుంచి పరారీలో ఉన్నట్లు సమాచారం. పరారైన మరో వ్యక్తి ఎవరనేది పోలీసులు వివరాలు వెల్లడించలేదు. వీరిద్దరినీ అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రత్యేక బృందాల ద్వారా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

కర్నూలు, కడప జట్ల విజయం



రణధీర్‌రెడ్డి, కడప(54 పరుగులు), విఖ్యాత్, నెల్లూరు (66 పరుగులు), కిన్నుకిశాల్, నెల్లూరు (50 పరుగులు)

కడప స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగు తున్న ఏసీఏ మెన్ అండర్ 19 వన్డే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా మంగళవారం కడప, కర్నూలు విజయం సాధించాయి. వివరాలిలా... కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు, కడప జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు తొలుత ఫీల్డింగు ఎంచుకుంది. దీంతో చిత్తూరు జట్టు బ్యాటింగ్ చేపట్టి 33.1 ఓవర్లలో 124 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు కేవలం 15.4 ఓవ ర్లలో 3 వికెట్లు కోల్పోయి 128 పరుగులు సాధించింది. ఇందులో రణధీర్‌రెడ్డి 54 పరుగులు, రోహిత్‌వర్మ 37 పరుగులు చేశారు.

వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో కర్నూలు జట్టు 7 వికెట్ల తేడాతో నెల్లూరు జట్టుపై విజయం సాధించింది. తొలుత టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు 48.1 ఓవర్లలో 176 పరుగులు సాధించి ఆలౌట్ అయింది. ఇందులో కిన్నుకిశాల్ 50 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 34 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయానికి అవసరమైన 180 పరుగులు సాధించింది. ఇందులో విఖ్యాత్ 66 పరుగులు చేసి జట్టు విజయానికి దోహదపడ్డాడు.

శ్మశాన స్థలం ఆక్రమణపై ధర్నా

● భూ ఆక్రమణదారుల నుంచి విడిపించాలని డిమాండ్ ● ఆర్డీవో పరిశీలన.. హద్దులు కేటాయింపు



ధర్నా నిర్వహిస్తున్న గ్రామ ప్రజలు, సీపీఎం నాయకులు, శ్మశాన స్థలాన్ని పరిశీలించి అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్

బ్రహ్మంగారిమఠం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సోమిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నెం.464లో 10 ఎకరాల 5 సెంట్లు భూమిని శ్మశానవాటికకు కేటాయించారు. అయితే ఇటీవల నలుగురు వ్యక్తులు శ్మశాన స్థలాన్ని ఆక్రమించి రెవెన్యూ రికా ర్డుల్లో తమ పేర్లను ఎక్కించుకున్నారు. దాదాపు 8 ఎకరాలు ఆక్రమిం చడంతో మిగిలిని రెండు ఎకరాల్లో పది గ్రామాల ప్రజలు దహన సంస్కారాలు, అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు ఇబ్బందులు పడేవారు. దీనిపై గత 8 నెలలుగా గ్రామస్తులు సంబంధిత అధికా రులు, ప్రజాప్రతినిధులకు అర్జీలను సమర్పించాచారు. అయితే సరైన స్పందన లేకపోవడంతో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో గ్రామ స్తులు శ్మశాన స్థలం వద్ద ధర్నా చేపట్టారు. శ్మశాన స్థలానికి పూర్తి స్థాయిలో కొలతలు నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు వెంటనే స్పందించిన ఆర్డీవో చంద్రమోహన్ అక్కడకు చేరు కొని పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం శ్మశాన స్థలానికి కొలతలు నిర్వహించి హద్దులను కేటాయించారు. రెండు మూడురోజుల్లో పూర్తిస్థాయిలో స్థలం చుట్టూ అధికారులు కంచెను ఏర్పాటు చేస్తారని తెలిపారు. కార్య క్రమంలో తహసీల్దారు రాజనరసింహ నరేంద్ర, డిప్యూటీ తహసీల్దారు జాన్సన్, వీఆర్వో సుధాకర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. కాగా, అంతకు ముందు ఆక్రమణదారులు ఆర్డీవోను కలిసి తమ రికార్డులు చూపించా రు. రికార్డులను పరిశీలించిన ఆర్డీవో చంద్రమోహన్ వారితో ఎక్కడే కానీ ఈ రికార్డులకు పూర్వపు రికార్డులకు సరిపోవడం లేదని.. ఆర్ఎస్ ఆర్‌లో స్మశాన స్థలమే ఉందన్నారు. శ్మశాన స్థలాల ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గండి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



నిత్యాన్నదాన పథకానికి విరాళాలు ఇస్తున్న దాతలు


చక్రాయపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో జరిగే శాశ్వత నిత్య అన్నదాన పథకానికి ప్రొద్దుటూరుకు నారాయణరెడ్డి, కళావతి దంపతులు రూ.50116, అలాగే తిరుపతి శ్రీకాళహస్తికి చెందిన కంభం సుధాకర్‌రెడ్డి, సంగీత దంపతులు రూ.50116 విరాళంగా ఇచ్చారు. దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, పూజా రులు ఆలయ మర్యాదలతో సత్కరించి ఘనంగా పూజలు చేయించారు.

వేలం ద్వారా రూ.25 వేలు ఆదాయం

కలకడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా వల్లూరు మండలంలో ఉన్న పుష్పగిరి మఠం భూములకు మంగళవారం నిర్వహించిన వేలంలో కౌలు ద్వారా రూ.25 వేలు ఆదాయం వచ్చినట్లు మఠం మేనేజర్ గిరిధర్ తెలిపారు. మఠానికి సంబంధించి కలకడ మండలంలోని నవాబ్‌పేట పంచాయతీ సర్వే నెంబరు 64లో 9.96 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. వీటి కౌలు హక్కులను వేలంలో హెచ్చుదారుగా నిలిచిన శంకర్‌నాయుడు ఏడాదికి రూ.25 వేలు చెల్లించేలా మూడేళ్లకు దక్కించుకున్నారు. మునుపు ఏడాదికి 1500 ఉన్న 23500 పెరిగి రూ.25 వేలుకు పెరిగింది. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సిద్దయ్య, దేవాదాయశాఖ అధికారి శశికుమార్, నాగభూషణ్ పాల్గొన్నారు.

యండపల్లి ఫార్మసీ అధికారి డెప్యుటేషన్ పొడిగింపు

కలికిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గతంలో కడప జిల్లాలోని యండపల్లి పీహెచ్‌సీలో ఫార్మసీ అధికారిగా పనిచేసే పి.ఉమాదేవి డెప్యుటేషన్ గడువును మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 2022లో ఆమెను యండపల్లి పీహెచ్‌సీ నుంచి డిప్యుటేషన్‌పై మంగళగిరిలోని ఏపీ వైద్య సర్వీసులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్‌లో డెప్యుటేషన్‌పై నియమించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది ఆమె డెప్యుటేషన్ గడువును పెంచుతూ వచ్చారు. అదే విధంగా తాజాగా మరో ఏడాది అంటే 2025-26 సంవత్సరం వరకూ నాలుగోసారి పొడిగిస్తూ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్మణి మంగళవారం డెప్యుటేషన్ పొడిగింపు ఉత్తర్వులు జారీ చేశారు.



మత్స్యశాఖలో బదిలీలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖలో బదిలీలు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. కడప ఏడీ ఫిషరీస్ ఎన్.రెడ్డయ్యను నంద్యాలకు బదిలీ చేయగా, కమిషనరు కార్యాలయంలో ఉన్న కె.నాగయ్యను కడప అసిస్టెంటు డైరెక్టరుగా బదిలీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి.

బాగుపడే 'దారే' ది..?

●పుట్లంపల్లె రోడ్డులో అడుగడుగునా గోతులే ● వాహనచోదకులకు తప్పని అవస్థలు

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అడుగడుగునా గుంతల మయం. ఇది మన రోడ్ల పరిస్థితి. ఈ దుస్థితిని తలచుకోవడానికి నిత్యం ప్రయా ణాలు చేసేవారికి ఇవి అనుభవమే. జిల్లా కేంద్రం పుట్లంపల్లె రోడ్డు అడుగుకో గోతులతో నరకం చూపిస్తున్నాయి. ఇక వర్షాకాలం వస్తే గోతులన్నీ నీటితో నిండి చెరువులను తలపిస్తాయి. ఎప్పటికప్పుడు మరమ్మతుల పేరుతో రూ.కోట్లలో వెచ్చిస్తున్నా కడప నగరంలోని రహదారుల పరిస్థితి మెరుగుపడకపోవడం గమనార్హం. వేసవికాలం ముగిసింది. అక్కడ క్కడా వర్షాలు పడుతున్నాయి. మండే ఎండల నుంచి ప్రజలు ఉపశమనం పొందుతున్న కడపనగర వాసులు మాత్రం వణికిపో తున్నారు. ఓ మోస్తరు వర్షాలకే ముంచుకొచ్చే ముప్పు తలచుకొని తల్లడిల్లిపోతున్నారు. పుట్లంపల్లె రోడ్డు అధ్వానంగా తయారైంది. కడప నగరంలోని వై.జంక్షన్ నుంచి రిమ్స్‌కు వెళ్లేందుకు ఇదో ప్రధానరహదారి అని చెప్ప వచ్చు. ఈ రోడ్డు పరిస్థితి అత్యంత దారుణం గా తయారైంది. అడుగుకో గుంత రోడ్డుకి ఇరువైపులా కంపచెట్లు చీకటైతే పాములు, విషపురుగులతో ఈ ప్రాంతం బిజీబిజీగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. చిన్నపాటి వర్షం కురిసిందంటే గుంతల్లో నీరు నిలిచి వాహనదారులకు నరకయాతన ఎదు రవుతుంది. ఈ రోడ్డు పూర్తిగా గోతుల మయంగా తయారైంది. వాహన రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నాయి. అడుగడు గునా స్పీడ్ బ్రేకర్లను తలపిస్తున్నాయి. ఎత్తుపల్లాలకారణంగా వాహనచోదకుల అవస్థలు వర్ణణాతీతమనే చెప్పాలి. కార్పొరేషన్ అధికారులు ఈ రోడ్డుపైదృష్టిసారిస్తే ఈ ప్రాంత ప్రజలకు కొంత ఊరట లభిస్తుందని చెప్పాలి.



గుంతలు, రోడ్డుకిరువైపులా కంపచెట్లతో అధ్వానంగా ఉన్న పుట్లంపల్లె రోడ్డు

నేడు పౌర్ణమి వేడుకలు

వీరపునాయునిపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎన్.పాలగిరి క్రాస్ వద్ద ఉన్న అవధూత కాశిరెడ్డినాయన ఆలయంలో బుధవారం పౌర్ణమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు లక్ష్మీరెడ్డి తెలిపారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని చెప్పారు. అంతేకాకుండా ఆలయ ప్రాంగణంలో ఆరుగంటల నుంచి కోలాటం జరుగుతుందన్నారు.

పక్కాగృహాలకు 257 దరఖాస్తులు

చెన్నూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో పక్కాగృహాలు కావాలంటూ 257 మంది దరఖాస్తు చేసుకున్నట్లు హౌసింగ్ ఏఈ మినిల్‌కుమార్‌తెలిపారు. ఇందులో గత ఏడాది జూలై 29 నుంచి ఈ నెల 5వరకు వచ్చిన దరఖాస్తులనే చెన్నూరు-1 వ సచివాలయం నుంచి 28, 2 నుంచి 40, 3 నుంచి 45, బలసింగాయపల్లెలో 23, బయనపల్లె 48, గుర్రంపాడు 12, రామనపల్లె 18, శివాలపల్లె 23, ఉప్పరపల్లె 20 మొత్తం 247 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అలాగే దరఖాస్తులతో పాటు రేషన్‌కార్డు, భార్యాభర్తల ఆధార్‌కార్డు దరఖాస్తు సమర్పించారని, వాటిపై క్షుణ్ణంగా తనిఖీ చేసి గతంలో వారికి పక్కాగృహాలు మంజూరైందా లేదా ప్రస్తుతం ఇళ్లు ఉన్నాయా లేవా అన్న వాటిపై విచారణ చేసి వాటిని ప్రభుత్వానికి పంపేందుకు సిద్ధం చేశామన్నారు. అలాగే పక్కాగృహాలతో పాటు ఇంటిస్థలాలు స్థలం కూడా కావాలనుకున్న వారికి రెవెన్యూ కార్యాలయానికి పంపడం జరిగిందన్నారు. అంతేకాక మండల వ్యాప్తంగా ఎవరికి పక్కాగృహం కావాలన్నా దరఖాస్తు చేసుకోవచ్చని ఇది నిరంతర ప్రక్రియ అని ఆయన తెపారు.

ఘనంగా బాలక్రిష్ణ జన్మదిన వేడుకలు

కడప కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నందమూరి బాలక్రిష్ణ (బాలయ్య) జన్మదిన వేడుకలు మంగళవారం కడప నగరంలో ఘనంగా జరిగాయి. అందులో భాగంగా జిల్లా పరిషత్ సమీప ప్రేమాలయ అనాథ వృద్ధాశ్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఎస్.గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్‌ల సారథ్యంలో తొలుత కేట్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలి

కమలాపురం రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గుండాల ఈశ్వరయ్యమాదిగ తెలిపారు. మంగళవారం కమలాపురం నియోజకవర్గం స్థాయి ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ముఖ్యనాయకత్వం, నియోజకవర్గం ఇన్‌ఛార్జ్‌లతో ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహామాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రతి మాదిగ బస్తీలలో జూలైన నిర్వహించబోయే ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావసదస్సులను ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు.

మసీదుపై పడిన పిడుగు

సీకేదిన్నె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం లింగారెడ్డిపల్లె గ్రామంలో మసీదు మినార్‌పై పిడుగు పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ప్రాణనష్టం జరుగలేదు. స్థానికులు అందించిన వివరాల మేరకు మంగళవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో కురిసిన వర్షానికి లింగారెడ్డిపల్లెలో ఉరుములు, మెరుపులు వచ్చాయి. ఈ క్రమంలో స్థానిక మసీదు మినార్‌పై పిడుగుపడి పక్కనే ఉన్న ముతాన్‌రెడ్డన్న ఇంటి వసారాకు వేసిన సిమెంటు రేకులపై పడి భూమిలోకి పోయిందన్నారు. ఆ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఎస్సీ కార్పొరేషన్‌లో బడ్జెట్ పెంచాలి

కడప,క లెక్టరేట్, జూన్ 10,(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పోరేషన్‌కు నామ మాత్రంగా బడ్జెట్ కేటాయించి ఎస్సీలకు మోసం చేసిందని నవ్యాంధ్ర ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గుడిమి జయరాజ్ మాదిగ విమర్శించారు. మంగళవారం ఎస్సీ కార్పోరేషన్ ఇడి రాజ్యలక్ష్మీకి వినతి పత్రం సమర్పించారు. నవ్యాంధ్ర జిల్లా ఉపాధ్యక్షుడు టి.ఓబులేశు మాదిగ, సుధాకర్ మాదిగ, సుబ్బరాయుడు మాదిగ, నిత్యపూజలయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అగ్నిమాపక శాఖ అధికారి



బి.యోగేశ్వర్‌రెడ్డి

కడప క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ కడప ఫైర్ స్టేషన్ అధికారిగా యోగేశ్వర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నంద్యాల అగ్నిమాపక కేంద్రంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న బస్విరెడ్డి ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు సంభవిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు చేపడతామన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం ఉచిత సీట్లు అమలు చేయాలి

వేంపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని సమగ్రంగా అమలు చేసి ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు ఉచితంగా 25శాతం సీట్లు అందేలా చూడాలని సిటిజన్ రైట్స్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గూడూరు రామచంద్ర డీఈఓ షంషద్దీన్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం వినతిపత్రం అందించారు. పేదలకు అందాల్సిన ఉచిత సీట్లు అమలైతే కొంతమందికైన మేలు జరుగుతుందని తెలిపారు. అధిక ఫీజులు లేకుండా చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించేలా తనిఖీలు నిర్వహించాలని డీఈఓకు వినతిపత్రంలో తెలియజేసినట్లు తెలిపారు.

విజయదుర్గమ్మ సన్నిధిలో రాహుకాల పూజలు



కడప కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం ఘనంగా రాహుకాల పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు హాజరై అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

బాల్యవివాహాలపై అవగాహన

సీకేదిన్నె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలని పంచాయతీ కార్యదర్శి ప్రేమలత తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో మంగళవారం అంగన్వాడీ సిబ్బంది, కిశోర బాలికలను, వారి తల్లులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు శారీరకంగా, మానసికంగా ఎదిగేందుకు కొంత సమయం పడుతుందని, అందుకు ప్రభుత్వం నిర్ణయించిన వయస్సు వచ్చేంతవరకు బాలికలకు వివాహం చేయరాదన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను అమలు చేయాలి

కడప సెవెన్ రోడ్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను అమలు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఎన్నికల హామీల అమలుచేయాలని కడప తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీకేఎంయూ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, జిల్లా నాయకులు కౌలు రైతుల జిల్లా గౌరవ అధ్యక్షుడు టక్కోలే మనోహర్‌రెడ్డి, బీకేఎంయూ జిల్లా నాయకులు సుందరం, కృష్ణ, తిరుపాలు, రాముడు పాల్గొన్నారు.

13న మండల సర్వసభ్య సమావేశం

పెండ్లిమర్రి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 13న శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు,అధికారులు తప్పక హాజరు కావాలని తెలిపారు.

'ఆర్థిక శక్తిగా ఎదిగామని చెప్పడంలో వాస్తవం లేదు'

వేంపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో నాలుగో ఆర్థికశక్తిగా ఎదిగామని బీజేపీ చెప్పడంలో వాస్తవం లేదని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 67 సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం చేసినఅప్పు రూ.46లక్షలకోట్లు కాగా 2014 నుంచి 2025 వరకు మోదీ ప్రభుత్వం చేసిన అదనపు అప్పు రూ.140లక్షలకోట్లు అన్నారు. ప్రపంచదేశాల సంతోష సూచికలో 144, సుస్థిరాభివృద్ధి సూచికలో 117, ఆకలి సూచికలో 124వ స్థానంలో భారత్ ఉందన్నారు. ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ 2025 నివేదిక ప్రకారం ప్రపంచంలో 188 దేశాలలో తలసరి ఆదాయంలో 2878డాలర్లతో భారత్ 136వ స్థానంలో ఉందన్నారు. రాష్ట్రానికి సంజీవినిలాంటి ప్రత్యేక హోదా, జిల్లాలో ఉక్కుకర్మాగారం, ఇలా విభజన హామీలు అమలు చేయడంలో రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేసిందన్నారు.

ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వేంపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఈనెల 15వ తేదీన ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు చైతన్య హైస్కూల్లో తిరుపతి వేంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్న ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మానవత సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి తెలిపారు. కంటికి సంబంధించిన అన్ని పరీక్షలను నిర్వహిస్తారని తెలిపారు. కంటి జబ్బులు ఉన్న వారుసద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆవోపా ఆధ్వర్యంలో 20న వైద్యశిబిరం..: ఆవోపా ఆధ్వర్యంలో ఉచిత సంతానసాఫల్య వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆవోపా ఆధ్వర్యంలో బైరిశెట్టి సునీల్, మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రవీణ తెలిపారు. కడపకు చెందిన ప్రముఖ సంతాన సాఫల్య నిపుణురాలు డాక్టర్ సామసుధ ఆధ్వర్యంలో ఈ సంతాన సాఫల్య వైద్యసేవలు ఉంటాయన్నారు. స్థానిక వాసవి కళ్యాణమండపంలో ఉదయం 10 నుంచి 2గంటల వరకు వైద్యశిబిరం ఉంటుందన్నారు.

వసతి గృహానికి చేరిన సన్నబియ్యం




వేముల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల విద్యార్థులకు మరింత నాణ్యమైన భోజనం అందించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విద్యాసంవత్సరం నుంచే వసతి గృహాలకు సన్నబియ్యం సరఫరా చేయనున్నట్లు తెలిపింది. దీంతో ప్రభుత్వ వసతి గృహాలకు సన్నబియ్యం చేరాయి. గతం కంటే మరింత మెరుగ్గా విద్యార్థులకు భోజనం అందుతుందని ఆయా వసతిగృహాల వార్డన్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

వేంపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రం పాటించాలని, రుతుక్రమంలో ప్రత్యే క జాగ్రత్తలు తీసుకోవాలని సీడీపీఓ సునీత తెలిపారు. వేంపల్లెలోని క్రిస్టి యన్ కాలనీలో కిశోరబాలికలకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశం 1వ సచివాలయంలోని క్రిస్టియన్ కాలనీలో నిర్వహించారు.సూపర్‌వైజర్ స్వర్ణలత, రిటైర్డ్ వార్డన్ నాగన్న, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

స్కానింగ్ కోసం రోగుల పాట్లు

పులివెందుల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కోట్లు ఖర్చుచేసి రోగులను పరీక్షిస్తామంటూ ఏర్పాటుచేసిన స్కానింగ్ యంత్రం నిరుపయోగంగా మారింది. సంబంధిత (డాక్టర్) రేడియాలజీ లేక స్కానింగ్ యంత్రం ఉన్నా బయట కేంద్రాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి ఏర్పడింది. బయట కేంద్రాల్లో వేలకు వేలు వెచ్చించాల్సిన దుస్థితి రోగులకు పట్టింది. డబ్బు ఉన్నా లేకపోయిన స్కానింగ్ అంటే రోగి వెనకాడకుండా చేయించుకోవాల్సిన వస్తోంది. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే ... పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో స్కానింగ్ చేసే (డాక్టర్) రేడియాలజీ లేక రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. పులివెందులలో నూతనంగా ప్రభుత్వ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. అందుకు కావాల్సిన యంత్రాలను సైతం సమకూర్చారు. కొన్ని యంత్రాలకు సంబంధించి డాక్టర్లు లేక అవి నిరుపయోగంగా ఉన్నాయి. అందులో ప్రధానమైంది స్కానింగ్ యంత్రం. ప్రస్తుతం రోగులు ఆసుపత్రికి వస్తే ఏ రోగానికైనా డాక్టర్ వెంటనే చెప్పే మాట స్కానింగ్. స్కానింగ్ యంత్రం ఆసుపత్రిలో ఉన్నా అది డాక్టర్ లేని కారణంగా పనిచేయడం లేదు. బయట డయాగ్నస్టిక్ సెంటర్‌లకు పరుగులు తీయాల్సి వస్తోంది. అక్కడేమో వేలకు వేలు రోగులను ముక్కుపిండి వసూలుచేస్తున్నారు. ప్రతిరోజు కనీసం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి దాదాపు 50 నుంచి 60 మంది రోగులకు స్కానింగ్ చేయించాలని డాక్టర్లు సలహాలు ఇస్తున్నారు. దీంతో బయట డయాగ్నస్టిక్ సెంటర్లకు వెళ్లి పరీక్షించుకోవాల్సి వస్తోంది. అందులోనూ మరీముఖ్యంగా గర్భిణీలకు ప్రతి నెలా తప్పనిసరిగా చేయిస్తుంటారు. గర్భిణీలు పులివెందుల పట్టణంలో ఉన్న డయాగ్నస్టిక్ సెంటర్లకు రావాలంటే దాదాపు 4కిలోమీటర్ల మేర ఆటోల్లో ప్రయాణించి ఇక్కడ స్కానింగ్ చేయించుకొని తిరిగి వెళ్లి డాక్టర్లకు చూపించాల్సి వస్తోంది. అంటే డబ్బు వెచ్చించడం ఒక వంతు అయితే వారు శ్రమపడాల్సిన పరిస్థితి వస్తోంది. నెలలు నిండిన గర్భిణీలు స్కానింగ్ సెంటర్లకు పరుగులు తీయాలంటే పడరానిపాట్లు అంటున్నారు. గత మూడు నెలలుగా పులివెందుల ఆసుపత్రిలో పనిచేస్తున్న రేడియాలజిస్టు (డాక్టర్) సెలవులో వెళ్లినప్పటి నుంచి రోగులకు ఈ ఇబ్బందులు తప్పడం లేదు. ఇదే విషయాన్ని ఆంధ్రజ్యోతి పులివెందుల ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసులును వివరణ కోరగా ఆయన స్పందిస్తూ విషయం జిల్లా అధికారులకు విన్నవించామన్నారు. త్వరలోనే నియామకం సాగుతుందని ఆశిస్తున్నామన్నారు.



పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో మూతపడ్డ స్కానింగ్ గది

ఫ్యాక్షన్ వల్ల జీవితాలు ఛిన్నాభిన్నం

ముద్దనూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షన్ వల్ల జీవితాలు ఛిన్నాభిన్న మవుతాయని ఫ్యాక్షన్ జోన్ సీఐ రియాజ్ అహమ్మద్ అన్నారు. మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో మంగళవారం రాత్రి పోలీస్ కళాజాగృతి బృందం మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాక్షన్ వల్ల కలిగే అనార్థాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సీఐ దస్తగిరి, పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించాలి : ఎమ్మెల్యే ఆది


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, చిత్రంలో ఆర్డీవో సాయిశ్రీ తదితరులు

జమ్మలమడుగు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఆలోచించి పట్టుదలగా చదవాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సూచించారు. మంగళవారం జమ్మలమడుగు పతంగే రామన్నరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దేవగుడి శంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సభకు ఎస్టీయూ నాయకులు ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్ వినూత్నంగా ఆలోచించి అత్యంత ప్రతిభావంతులై గొప్ప కంపెనీలకు సీఈవోలు కాగలిగారన్నారు. ఆర్డీవో సాయిశ్రీ మాట్లాడుతూ బావిలో కప్పలాగా ఉండకుండా విద్యార్థులు ప్రతిదానిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉన్నతస్థాయికి వెళ్లాలంటే ఒక్క చదువు మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. ఎస్టీయూ నాయకుడు సురేష్‌బాబు, పాఠశాల హెడ్మాస్టర్ శశికళ మాట్లాడుతూ చదువు వలన సమాజంలో గౌరవం పెరుగుతుందన్నారు. చదువుకు పేద, ధనిక, మతం తేడా లేదన్నారు. అనంతరం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఒక్కొక్క విద్యార్థికి రూ.2,500 విలువైన సైంటిఫిక్ క్యాలుకులేటర్, కాలేజీ బ్యాగు, ఇంగ్లీషు గ్రామర్ పుస్తకం అందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి గురుకుమార్, ఎంఈవోలు చౌడయ్య, చిట్టిబాబు, మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, గోనా పురుషోత్తం రెడ్డి, కూటమి నాయకులు కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి, వీరంరెడ్డి పేటా ఓబుళరెడ్డి, చెన్నకేశవరెడ్డి, కర్నాటి రామాంజనేయరెడ్డి, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డు

బ్రహ్మంగారిమఠం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందిమల్లయ్యపల్లె జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో 2024-25 పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉత్తమ విద్యార్థులుగా నిలిచిన సాయి చైతన్య, వెంకటసురేశ్, గురుపవిత్ర, కె.జ్యోత్స్న షైనింగ్‌స్టార్స్‌కు ఎంపిక కావడం జరిగిందని, వీరికి ఈనెల 9వతేదీన కలెక్టరు చేతుల మీదుగా అవార్డు కింద రూ.20 వేలు చెక్కును అందించినట్లు మోడల్ మండల్ విద్యాశాఖాధికారి పుల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మణస్వామిరెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు లెక్కల కొండారెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కొండాపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తెలిపారు. స్థానిక రామసుబ్బారెడ్డినగర్‌లో బాలవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం కుళ్లాయమ్మ, మహిళా పోలీసు మౌనిక, అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డ క్షేమం

బద్వేలు రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉప అధికారి డాక్టర్ మల్లేశ్ అన్నారు. మంగళవారం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాతృత్వ సురక్షిత అభియాన్ కార్యక్రమాన్ని డాక్టర్ జె.వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి గర్భిణీ ప్రతి నెలా 9న జరిగే ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో నిర్వహించే పరీక్షలకు తప్పక హాజరై వైద్య సేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటరు వెంగయ్య, కొంగలవీడు ఆయుష్మాన్ ఆరోగ్య సిబ్బంది, ఎన్‌ఎంలు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు

బి.కోడూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సగిలేరు గురుకుల పాఠశాలలో మంగళవారం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసరు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో దోమల నివారణ మందు పిచికారి చేశారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా పాఠశాల సిబ్బందికి దోమల వల్ల వచ్చే జ్వరాలపై అవగాహన కల్పించారు.

పేదలకు భూములు ఇవ్వాలి

పోరుమామిళ్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పుల్లీడు పంచాయతీలో అర్హులైన పేదలకు భూములు ఇవ్వాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొప్సాపురం, చెన్నారెడ్డిపేట, పుల్లీడు పంచాయతీల్లో కొంతమంది ధనవంతులు దళితులపై దౌర్జన్యం చేయడం మంచిది కాదన్నారు. బొప్సాపురం సర్వే నెం.181 లో ప్రభుత్వ బంజరు భూమి ఉందని, ఆ భూమిని దళితులకు ఇవ్వాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పిడుగు మస్తాన్, రవికుమార్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

పుట్టాను కలిసిన వైసీపీ నేతలు


ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను కలిసిన వైసీపీ నేత రాజానాయుడు

బ్రహ్మంగారిమఠం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజరు పంచాయతీ రేకలకుంట్లకు చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ కూనపులి రాజానాయుడు మంగళవారం టీడీపీ సీనియర్ నాయకుడు ఎం.రామచంద్రనాయుడు ఆధ్వర్యంలో రేకలకుంట్ల పంచాయతీ టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే వేలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్‌యాదవ్‌ను కలిశారు. అనంతరం కూనపులి రాజానాయుడు మాట్లాడుతూ టీడీపీ అమలు చేసే పథకాలకు ఆకర్షితుడనై టీడీపీలోకి చేరానని, అలాగే ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆదేశాల మేరకు పార్టీ అభివద్ధి కోసం తనవంతు కృషి చేస్తామని తెలిపారు. వైసీపీలో విసుగు చెంది టీడీపీలో చేరానన్నారు. కాగా ఈయన వైసీపీకి చెందిన బి.మఠం ఉప మండలాధ్యక్షురాలు కూనపులి సుభాషిణి భర్త. కార్యక్రమంలో మాజీ ఉప మండలాధ్యక్షుడు భూతప్పనాయుడు, రేకలకుంట్ల యూనిట్ ఇన్‌చార్జి వెంకటేశ్‌నాయుడు, ఓబయ్యనాయుడు, గంగినాయుడు, పెరుగు నాగేశ్‌యాదవ్, పి.గంగులు, గంగినాయుడు, బ్రహ్మనాయుడు, మల్లయ్య పాల్గొన్నారు.

ఆరో రోజుకు అల్ట్రాటెక్ కార్మికుల ఆందోళన

● లోపలికి వెళ్లేందుకు వచ్చినవారిని అడ్డుకున్న ఆందోళనకారులు

ఎర్రగుంట్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల అల్ట్రాటెక్ (ఐసీయల్) ప్యాకింగ్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న ఆందోళన మంగళవారం ఆరో రోజుకు చేరుకుంది. వేతనాలు పెంచాలని, 26రోజుల పనిదినాలు కల్పించాలని, ఇతర ఫ్యాక్టరీల మాదిరిగా ఇతర అలవెన్సులు కల్పించాలని ఆరు రోజులుగా మెయిన్‌గేటు ముందు ధర్నా చేస్తున్నారు. యాజమాన్య ఉద్యోగులు, ఇతర కాంట్రాక్టు కార్మికులను ఎవ్వరినీ లోపలికి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నారు. దీంతో ప్లాంటులో పనులన్నీ బంద్ అయ్యాయి. మంగళవారం ఉదయం కూడా లోపలికి వెళ్లేందుకు వచ్చిన ప్లాంట్ యాజమాన్య ఉద్యోగులను, ఇతర కాంట్రాక్టు కార్మికులను ఆందోళనకారులు అడ్డుకున్నారు. ఇదిలా వుండగా రెండు రోజులుగా యాజమాన్యం కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తోంది. ఎలాగైనా ఇతర కార్మికులను లోపలికి పంపాలని హుకుం జారీ చేసింది. అయితే మెయిన్ గేటు వద్దకు వచ్చినవారిని వెనక్కు పంపుతున్నారని, తామేమి చేయలేమని కాంట్రాక్టర్లు కూడా చేతులెత్తుస్తున్నారు.

శ్మశానానికి మౌలిక వసతులు కల్పించండి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె పంచాయతీలోని వివేకానంద కాలనీ, ప్రకాశ్‌నగర్‌కు సంబంధించిన శ్మశానానికి మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి అధికారులను ఆదేశించారు. అక్కడి ప్రజల వినతుల మేరకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సర్వే నంబరు 604లో ఉన్న 4.28 ఎకరాల శ్మశాన స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ప్రకాశ్‌నగర్, వివేకానంద కాలనీ ప్రజలు శ్మశానానికి దారి లేదని తన దృష్టికి తెచ్చారని, దారి లేకపోతే దహన సంస్కారాలు ఎలా నిర్వహిస్తారని అధికారులను ప్రశ్నించారు. సమస్యను పరిశీలించి త్వరగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దారు గంగయ్య రికార్డులను పరిశీలించి శ్మశానానికి ముందు భాగంలో ప్రైవేటు స్థలాలు ఉండడంతో వారు దారి మూసివేశారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై ఎమ్మెల్యే శ్మశానం చుట్టూ హద్దులు ఏర్పాటు చేసి ప్రహరీని నిర్మించాలని, ఉత్తర భాగంలో దారి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, వార్డు మెంబర్ హర్షవర్ధన్‌రెడ్డి, మండల సర్వేయర్ వెంకటలక్ష్మి, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమానికిరూ.20 వేలు విలువైన నిత్యావసర వస్తువులను ఆర్కే హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ సహకారంతో మీకోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. రచయిత జింకా సుబ్రమణ్యం మాట్లాడుతూ కువైట్‌కు వెళ్లినవారు తమ సంపాదనలో కొంత భాగం సేవా కార్యక్రమాలకు వెచ్చించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణువర్ధన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'మహిళా కళాశాల హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి'

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బీసీ మహిళా కళాశాల హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు, తెలుగురాష్ట్ర విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాజు, ఎన్డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హాస్టల్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సౌలభ్యం కోసం ఈనెల 1వ తేదీనే హాస్టల్‌ను ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించినా ఇంతవరకు హాస్టల్‌ను ప్రారంభించకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు.

దళిత మహిళలకు రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దళిత మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని రాష్ట్ర మాల మహానాడు రామోజీ వర్గం జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్ అన్నారు. మంగళవారం సాయంత్రం పాత బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అనంతపురం జిల్లాలో హత్యకు గురైన తన్మయి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురంలో ఇంటర్మీడియట్ విద్యార్థిని తన్మయిని, అలాగే మైలవరంలోని కంబాలదిన్నెలో నాలుగు సంవత్సరాల చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దళిత మహిళల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలి

పోరుమామిళ్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని మానవ హక్కుల చీఫ్ గంగన్న, కార్యదర్శి ఫణిరావు తెలిపారు. మంగళవారం వారు పోరుమమామిళ్లలోని గిరినగర్ జిల్లా పరిషత్ హైస్కూలు, ఉర్దూ హైస్కూలును పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గిరినగర్‌కాలనీలో ఉన్న యూపీ స్కూలు బిల్డింగు నిర్మాణంలో ఉందని, ఇక్కడ మంచినీరు సరిగా లేదన్నారు. కాంపౌండు వాల్ లేదని, పిల్లలు ఆడుకునేందుకు మైదానం కూడా లేదన్నారు. ముస్లిం కోటవీధిలో జిల్లా పరిషత్ హైస్కూలులో కాంపౌండు వాల్, నీటి వసతి, భోజనం చేయడానికి రూము కూడా లేదని, చెట్ల కింద, రేకుల కింద వంట నిర్వహిస్తున్నారన్నారు. ఇక్కడ ఉన్న ఇంకుడు గుంత వర్షాకాలంలో విద్యార్థులకు ప్రమాదకరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పోస్టాఫీసు వద్ద అంగన్వాడీ బిల్డింగు అర్ధాంతరంగా ఆగిందని, దీంతో చుట్టుపక్కలవారు బాత్‌రూములకు వాడుకుంటున్నారన్నారు. రెండురోజుల్లో పాఠశాలలు ప్రారంభం అవుతున్నాయని, కావున అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కును అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌రెడ్డి

పోరుమామిళ్ల/కలసపాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితీష్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. మంగళవారం పోరుమామిళ్లకు చెందిన మద్దూరు రాముడుకు రూ.65వేలు, అలాగే కలసపాడు మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన తిరుపాల్‌కు రూ.45వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్, టీడీపీ మండల అధ్యక్షుడు నగిరి భైరవప్రసాద్, రావూరి నాగభూషణం, బద్వేల్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సాధనకారి రంతు, రాచ్చెరువు నీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి అమలులో విఫలం

బద్వేలు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ భృతి అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగభృతి ఇస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన టీడీపీ ఏడాది అయినా 4 లక్షల ఉద్యోగాలు పూర్తి చేయాల్సి ఉండగా కనీసం 40 వేలు కూడా భర్తీ చేయలేదన్నారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి నెలరోజుల వరకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ప్రభుత్వానికి, కలెక్టర్లకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వి.శ్రీను, జిల్లా సమితి సభ్యులు సుజన్ తదితరులు పాల్గొన్నారు.

11వ మహాసభలను జయప్రదం చేయండి

బద్వేలు/పోరుమామిళ్ల, జూన్10, (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈనెల 14, 15వ తేదీలలో జరిగే యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 11వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగరాజ, వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయ ఆవరణలో పోస్టర్లను విడుదల చేశారు. పెండింగులో ఉన్న డీఏలు, కారుణ్య నియామకాలు, ఈపీఎఫ్, మెడికల్ పాలసీ, కార్మికుల రెగ్యులరైజేషన్ వంటి సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే పోరుమామిళ్ల విద్యుత్ సబ్ డివిజను కార్యాలయ ఆవరణలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్, సుబ్బరాజ మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దశరథ, గురప్ప, శ్రీను, రఘురాం, సురేశ్, రాజమ్మ, సలోమి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వ్యాయామ పరికరాలు


వ్యాయామ పరికరాలను పరిశీలిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వ్యాయామ పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయని, వీటిని ప్రజా వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు, పాలకవర్గాలు విఫలమయ్యారని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని అన్నారు. మంగళవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న బహిరంగ వ్యాయామ పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రజల ఆరోగ్యరక్షణ కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసి బద్వేలు మున్సిపాలిటీకి కేటాయించిందని, ప్రస్తుతం అవి తుప్పుపట్టిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. యోగాంధ్ర కార్యక్రమంలోనైనా వీటిని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్, షరీఫ్, షేక్ అదిల్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, యువరాజు, సహాయ కార్యదర్శి నరసింహ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలక్రిష్ణ జన్మదిన వేడుకలు


ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న అభిమానులు

జమ్మలమడుగు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో మంగళవారం నటసింహం నందమూరి బాలక్రిష్ణ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, నందమూరి బాలక్రిష్ణ అభిమాన సంఘం నాయకులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా వారు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే జమ్మలమడుగులోని టీపీఆర్ సినిమా థియేటర్‌లో కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో నందమూరి అభిమానులు, కూటమి నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సూర్యారాయల్, పొన్నతోట మల్లికార్జున, పొన్నతోట శ్రీను, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బొమ్మన సుబ్బరాయుడు జన్మదిన వేడుక

బద్వేలుటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా పార్లమెంట్ కన్వీనర్, బొమ్మన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మన సుబ్బరాయుడు జన్మదిన వేడుకలు మంగళవారం ఆత్మీయులు, స్నేహితులు, అభిమానుల మధ్య మంగళవారం స్థానిక వాసవీకాంప్లెక్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథ శరణాలయాల్లో అన్నదానం, ఆసుపత్రుల్లో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆత్మీయులు, అభిమానులు, బీజేపీ కూటమి నాయకులు పెద్ద ఎత్తున చేరుకొని గజమాలతో సత్కరించి కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే యూనియన్ అధ్యక్షుడు భూమిరెడ్డి వెంకటేష్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్, ఎల్ఎస్పీ డ్యాం చైర్మన్ ఈగ రమణారెడ్డి, కాంట్రాక్టర్ శ్రీనివాసులరెడ్డి, ఆవులేటి శేఖర్ రాయల్, వల్లెంకొండు వెంకటరమణ, బొమ్మన విజయ్, గాజుల కుమార్, దీపిక్ డ్రైవింగ్ స్కూలు అధినేత చెన్నయ్య, అమ్మాడ్రైవింగ్ స్కూలు అధినేత నాగరాజు, నాగార్జున, దర్శి సుబ్బరాజా, లకిడి విజయ్, మస్తాన్‌బాబు, ఎర్రంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, మనోజ్, సత్య టౌన్‌షిప్ అధినేత ఎస్వీ సుబ్బారావు పాల్గొన్నారు.


ఆత్మీయుల మధ్య కేక్ కట్ చేస్తున్న బొమ్మన సుబ్బరాయుడు